



Truth of News

# సూర్య వాస్తవం

PRGI Reg No: APTEL/26/A4782

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

శ్రీసత్యసాయి | సంపుటి: 03 | సంచిక : 46 | గురువారం 24 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi


# సర్ పేరుతో ఈసీ దేశ ద్రోహానికి పాల్పడింది

## - రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, తేజస్వీ యాదవ్



**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ)పై ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ, ఆర్జేడీ అధినేత తేజస్వీ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్ ప్రక్రియ పేరుతో ఈసీ రాజ్యాంగంపై ప్రత్యక్ష దాడి చేస్తోందని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ , ఈసీ దేశద్రోహానికి పాల్పడ్డాయని మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఈసీపై విమర్శలు గుప్పించారు.

"నేను ఎన్నికల కమిషన్‌కు, ఎన్నికల అధికారులకు స్పష్టంగా చెబుతున్నాను. మీరు చేస్తున్నది తప్పు. ఇది దేశద్రోహం, ఇది దేశానికి వ్యతిరేకం. ఇది మర్చిపోవద్దు. సమయం వస్తుంది! మేము మిమ్మల్ని పట్టుకుంటాము! మిమ్మల్ని వదిలిపెట్టం." అని ఆయన రాసుకొచ్చారు. బీజేపీకి అనుకూలంగా వ్యవహరించే అధికారులను నియమించడం ద్వారా ఎన్నికల నిర్వహణ యంత్రాంగం పక్షపాతపూరితంగా

- మిగతా 2లో..



# మోడీ పుట్టినరోజున రైతులపై కేసులు

**- వ్యవసాయ భూముల మీదుగా వెళ్తున్న విద్యుత్ లైన్లు**
**- 17న మోడీ, షా దిష్టిబొమ్మల దహనం**
**21 మందిపై ఎఫ్ఐఆర్**
**- ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఘటన**
**- దానికి వ్యతిరేకంగా అన్నదాతల ఆందోళన**
**- అదానీకి చెందిన సంస్థపై నాలుగు నెలలుగా పోరాటం**

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

ప్రధాని మోడీ పుట్టినరోజున రైతులకు అవమానం జరిగింది. ప్రజాస్వామ్యయుతంగా నిరసనలు చేస్తున్న అన్నదాతలపై కేసులు నమోదయ్యాయి. మోడీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనపై బాధిత రైతులు విస్మయం వ్యక్తం చేశారు. ఈనెల 17న మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిష్టిబొమ్మలను కొందరు రైతులు దహనం చేశారు. అయితే ఈ ఘటనపై గుజరాత్‌లోని మోర్బీ జిల్లా జెట్‌పర్ గ్రామానికి చెందిన 21 మంది రైతులపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తమ నిరసన మోడీ పుట్టినరోజుకు వ్యతిరేకంగా

- మిగతా 2లో..

# ఈసీలోనే 'సర్'పై తిరుగుబాటు!

**- ఎన్నికల కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు?**
**- 10 నెలల్లో 14 సార్లు అభ్యంతరాలు**
**- 'చట్టవిరుద్ధం' అంటూ ఫారమ్-6 మార్పుపై ఆగ్రహం**
**- రాజకీయంగా చర్చకు దారి తీస్తున్న తాజా పరిణామం**

ఓటర్ల జాబితా సవరణ పేరుతో దేశవ్యాప్తంగా జరుగుతున్న సర్‌పై రాజకీయ దుమారం కొనసాగుతుండగానే.. ఇప్పుడు ఎన్నికల కమిషన్‌లోనే విభేదాలు బయటపడ్డాయి. ముగ్గురు సభ్యుల కమిషన్‌లో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు గత పది నెలల్లో కనీసం 14 సార్లు కీలక నిర్ణయాలపై లిఖితపూర్వకంగా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కొత్త ఓటర్ల నమోదు నుంచి ఓటర్ల పేర్ల తొలగింపు వరకు, ఓటర్ల డేటాబేస్‌పై నియంత్రణ నుంచి బెంగాల్‌లో ఓటర్ల తొలగింపుపై అప్పీళ్ల వరకు ఈ అభ్యంతరాలు ఉన్నట్టు నివేదికలు వివరిస్తున్నాయి.

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నేతృత్వంలోని ఎన్నికల కమిషన్‌లో అంతర్గత విభేదాలు తీవ్ర స్థాయికి చేరినట్టు తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి.. సర్‌కు సంబంధించిన పలు నిర్ణయాలపై పదేపదే ప్రశ్నలు లేవనెత్తినట్టు బయటపడింది. ముఖ్యంగా ఈ నిర్ణయాలు తమకు తెలియకుండా, తమ అనుమతి లేకుండా తీసుకున్నారనే అభ్యంతరాలను వారు నమోదు చేసినట్లు ఓ ఆంగ్ల వార్తా

- మిగతా 2లో..



# ఈసీల నియామకంపై సుప్రీం భిన్న తీర్పు

**- విస్తృత ధర్మాసనానికి పంపడంపై**
**- ఇద్దరు న్యాయమూర్తుల మధ్య విభేదం**
**- రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటుపై సీజేఐకి సిఫారసు**




**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం**

ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్ల (ఈసీలు) నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు బుధవారం భిన్న తీర్పు వెలువరించింది. ఈ వ్యవహారాన్ని విస్తృత ధర్మాసనానికి నివేదించాలన్న కేంద్ర ప్రభుత్వ అభ్యర్థనపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. దీంతో కేసును తగిన సంఖ్యలో న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) ముందుంచాలని ఇద్దరు న్యాయమూర్తులు

- మిగతా 2లో..



# ఉత్తరాంధ్రకు తీవ్ర వాయుగుండం ముప్పు..

**- సీఎం చంద్రబాబు సమీక్ష**
**- శ్రీకాకుళం-కవిటి మధ్య తీరం దాటనున్న వాయుగుండం**
**- ఉత్తరాంధ్ర జిల్లాలకు భారీ నుంచి అతి భారీ వర్షాల సూచన**
**- గంటకు 85 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం**
**- యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు**

**అమరావతి - సూర్య వాస్తవం**

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం రాష్ట్రం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. ఈ తీవ్ర వాయుగుండం శ్రీకాకుళం జిల్లాలోని శ్రీకాకుళం--కవిటి మధ్య తీరం దాటే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఇది తీరం దాటే

- మిగతా 2లో..


సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి


# పంచ సూత్రాలతో అమరావతి నిర్మాణం..

**- భవిష్యత్ ప్రణాళికలను వివరించిన చంద్రబాబు - తుళ్లూరుమండలంలో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన**
**- ఈ కేంద్రం ప్రపంచంలోనే అత్యుత్తమ కంటి వైద్యశాలగా నిలవాలని ఆకాంక్ష**
**- పంచ సూత్రాల ఆధారంగా అమరావతిని ప్రపంచస్థాయి నగరంగా నిర్మిస్తున్నామని వెల్లడి**
**- క్వాంటం వ్యాలీ, హెల్త్ కేర్ హబ్‌గా ఏపీని తీర్చిదిద్దుతామని హామీ**



**అమరావతి - సూర్య వాస్తవం**

రాజధాని కోసం భూములు త్యాగం చేసిన రైతులకు ముఖ్యమంత్రి ప్రత్యేక అభినందనలు

ఏపీ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ముందడుగు పడింది. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ నూతన క్యాంపస్‌కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం శంకుస్థాపన చేశారు. తుళ్లూరు మండలం అబ్బరాజు పాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన భూమి పూజ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ, అమరావతిని ప్రపంచం మెచ్చే నగరంగా, విజ్ఞానం, ఆరోగ్యం, సాంకేతికతకు కేంద్రంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ నూతన కేంద్రం కేవలం రాష్ట్రానికే కాకుండా, ప్రపంచ కంటి వైద్య రంగంలోనే ఒక మైలురాయిగా నిలవాలని ఆకాంక్షించారు.

**ప్రపంచంలోనే నంబర్ వన్ కావాలి**

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ, "40 ఏళ్ల క్రితం లాభాపేక్ష లేకుండా, కేవలం ప్రజాసేవ అనే లక్ష్యంతో ప్రారంభమైన ఎల్వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్, ఇప్పటివరకు మూడు కోట్ల మందికి చికిత్స అందించి చరిత్ర సృష్టించింది. దేశంలో నెంబర్ 1, ఆసియాలో నెంబర్ 2, ప్రపంచంలో 6వ స్థానంలో ఉన్న ఇంతటి ప్రతిష్టాత్మక సంస్థ

- మిగతా 2లో..




# దసరాలోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కావాలి

**- జీ-9 గ్రేడ్ బొగ్గు కొరతపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష**
**- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో చర్చించాలని డిప్యూటీ సీఎం భట్టికి సూచన**
**- గత ప్రభుత్వ తప్పుల వల్లే రాష్ట్రంపై రూ. 40 వేల కోట్ల అదనపు భారం**
**- ఎత్తిపోతల పథకాలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఆటంకం ఉండకూడదు**

**హైదరాబాద్ - సూర్య వాస్తవం**

దసరా లోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి గారు ఆదేశించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి అవసరమైన జీ-9 గ్రేడ్ బొగ్గు విషయంలో తక్షణమే కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి గారితో చర్చించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకి సూచించారు. విద్యుత్ శాఖపై ముఖ్యమంత్రి గారు ఉప ముఖ్యమంత్రితో కలిసి ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. యాదాద్రి థర్మల్ కేంద్రంలో పూర్తి స్థాయి విద్యుత్ ఉత్పత్తి చేయకపోవడంపై ఈ సందర్భంగా అధికారులను ప్రశ్నించారు. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి +-9 గ్రేడ్ బొగ్గు అవసరమని అధికారులు వివరించారు. సింగరేణిలో జీ 9 గ్రేడ్ బొగ్గు ఉత్పత్తి చేసే బ్లాకులు లేవని, సమీప భవిష్యత్తులోనూ సింగరేణి నుంచి జీ 9 బొగ్గు ఉత్పత్తి అయ్యే అవకాశం లేదని అధికారులు తెలిపారు.

- మిగతా 2లో..

# సర్ పేరుతో ఈసీ దేశ ద్రోహానికి పాల్పడింది

(మొదటిపేజీ తరువాయి)

మారిందని మమతా బెనర్జీ అన్నారు. దేశ ఎన్నికల చరిత్రలోనే ఇది అపూర్వమైన కుంభకోణమని, ఇది అత్యంత వివాదాస్పదమైన వ్యవహారం. తమ జీవితంలో ఇలాంటిది ఎప్పుడూ చూడలేదు. ఈ ఎన్నికల కమిషనర్‌ను తప్పక అరెస్టు చేయాలి. పదవిలో కొనసాగే నైతిక అర్హత ఆయనకు లేదు అని ఆమె డిమాండ్ చేశారు.

సర్ పేరుతో ఆయా రాష్ట్రాల్లోని ప్రజా తీర్పును అపహరించారని, బీహార్, పశ్చిమ బెంగాల్‌లలో మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని బీహార్ శాసనసభ నేత తేజస్వి యాదవ్ డిమాండ్ చేశారు. గత 10 నెలల్లో మేము ఎన్నికల కమిషన్‌కు అనేక ఫిర్యాదులు చేశామని. కమిషన్‌లోని ఇతర ఎన్నికల కమిషనర్లు దీనిపై ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ మాత్రం మౌనంగానే ఉన్నారని ఆయన విమర్శలు గుప్పించారు.

# మోడీ పుట్టినరోజున రైతులపై కేసులు

(మొదటిపేజీ తరువాయి)

కాదనీ, వ్యవసాయ భూముల మీదుగా నిర్మిస్తున్న హైటెన్షన్ విద్యుత్ లైన్లు, టవర్లకు వ్యతిరేకంగానే నాలుగు నెలలుగా ఆందోళన చేస్తున్నామని రైతులు చెప్తున్నారు. జూన్ నుంచి జెట్‌పర్‌తో పాటు చుట్టుపక్కల 35 గ్రామాల రైతులు ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్నారు.

అదానీ ఎనర్జీ సొల్యూషన్స్‌కు చెందిన హల్వాడ్ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్ విద్యుత్ టవర్లను ఏర్పాటు చేస్తోంది. తమ భూముల వినియోగానికి మరింత పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. జులైలో ప్రభుత్వం మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం చెల్లించే కొత్త విధానాన్ని ప్రతిపాదించినా, అన్ని డిమాండ్లు నెరవేరలేదని రైతులు చెప్తున్నారు.

ఈనెల 17న జరిగిన దిష్టిబొమ్మల దహనం అనంతరం మోర్బీ తాలూకా పోలీసులు 18న ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్లను పోలీసులు నమోదు చేశారు. అయితే ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న 21 మందిలో కొందరు ఘటనాస్థలంలో లేరని రైతు నాయకులు ఆరోపించారు. కాగా ఈ ఉద్యమానికి స్థానిక బీజేపీ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కాంతిభాయ్ అమృతియా సోదరులు కరాభాయ్, భరత్‌భాయ్ మద్దతు ప్రకటించడం గమనార్హం. కరాభాయ్ రైతులతో కలిసి నిరసనలో పాల్గొన్నారు. రైతులపై నమోదైన కేసు వారిని భయపెట్టే ప్రయత్నమని ఆయన ఆరోపించారు. విద్యుత్ లైన్ల వల్ల పంటలు, చెట్లు, భూమి విలువ దెబ్బతింటాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టవర్ల కోసం భూమి మార్కెట్ విలువ ఆధారంగా అధిక పరిహారం, పంటలు-చెట్ల నష్టానికి ప్రత్యేక పరిహారం, ప్రమాద బీమా, ముందస్తు చెల్లింపులు, ప్రభుత్వ, గౌచర్ భూములకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు కోరుతున్నారు. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు ఆందోళన కొనసాగిస్తామని రైతు నాయకులు స్పష్టం చేశారు.

# దసరాలోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి ప్రారంభం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

జీ 9 గ్రేడ్ బొగ్గు లభ్యత లేనప్పుడు ఆ సాంకేతికతపై ఆధారపడిన యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం ఎలా నిర్మించారని ముఖ్యమంత్రి , డిప్యూటీ సీఎం అధికారులను ప్రశ్నించారు. పిట్ హెడ్ బొగ్గు గనుల పైనే విద్యుత్ కేంద్ర నిర్మాణం కాకుండా, యాదాద్రి థర్మల్ కేంద్రాన్ని ఎందుకు దూరంగా నిర్మించారని అడిగారు. ఈ కేంద్రానికి బొగ్గు సరఫరా చేయడం వల్ల రాష్ట్రంపై పడే అదనపు భారం ఎంత అని అధికారులను ప్రశ్నించారు.అప్పట్లో రాజకీయ కారణాలతోనే పిట్ హెడ్‌పై కాకుండా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం దూరంగా నిర్మించారని అధికారులు తెలిపారు. యాదాద్రికి బొగ్గు సరఫరాతో తెలంగాణ రాష్ట్రంపై రూ. 40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని చెప్పారు. సింగరేణి నుంచి జీ-9 గ్రేడ్ బొగ్గుకు ఉన్న అవకాశాలపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడంతో జీ-9 గ్రేడ్ బొగ్గును సింగరేణి నుంచి సరఫరా చేయలేదని అధికారులు వివరణ ఇచ్చారు. సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని సమావేశంలో అధికారులు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ అవసరాల దృష్ట్యా మహానది కోల్ ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు చర్యలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఎత్తిపోతల పథకాల పంపులకు విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని సమావేశంలో ముఖ్యమంత్రి అధికారులకు చెప్పారు. అన్ని థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుత అవసరాలకు తగినట్లు విద్యుత్ కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు , సీఎం సలహాదారు కె.రామకృష్ణారావు, ఇంధన శాఖ అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సింగరేణి కాలరీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రకు తీవ్ర వాయుగుండం ముప్పు..

(మొదటిపేజీ తరువాయి)

సమయంలో గంటకు 85 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. దీని ప్రభావంతో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, పోలవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

అలాగే పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడొచ్చని అంచనా వేశారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని, జిల్లా కలెక్టర్లు, అధికారులు పూర్తి అప్రమత్తంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

# ఈసీలోనే 'సర్'పై తిరుగుబాటు!

(మొదటిపేజీ తరువాయి)

సంస్థ కథనం వెల్లడించింది. కొత్త ఓటర్ల నమోదుకు ఉపయోగించే ఫారమ్-6లో సర్‌కు సంబంధించిన ప్రశ్నలను చేర్చడంపై ఇద్దరు కమిషనర్లు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. కొత్త ఓటరు లేదా వారి తల్లిదండ్రులు, తాతముత్తాతల పేర్లు గత సర్ ఓటర్ల జాబితాలో ఉన్నాయా అని ప్రశ్నించేలా ఫారమ్‌ను మార్చారు. ఈ మార్పు చేయాలంటే ఎన్నికల నమోదు నిబంధనలను సవరించాల్సి ఉంటుందని వివేక్ జోషి మేలోనే స్పష్టం చేసినట్టు నివేదిక పేర్కొంది. సుఖ్‌బీర్ సింగ్ సంధు కూడా దీనితో ఏకీభవించారు. అయినప్పటికీ మార్పు అమల్లోకి వచ్చింది. ఆగస్టు 13న సంధు ఈ మార్పును 'అనధికారికం, చట్టవిరుద్ధం'గా పేర్కొని వెంటనే తొలగించాలని కోరారు. ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. కొత్త ఓటరుగా నమోదు కావడానికి చట్టబద్ధంగా ఉన్న ఫారమ్‌లోనే నిబంధనలకు విరుద్ధంగా మార్పులు జరిగాయా? జరిగితే ఎవరి ఆదేశాలతో జరిగాయి? ఇద్దరు కమిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేసిన తర్వాత కూడా ఆ మార్పు ఎందుకు కొనసాగింది? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇప్పటికీ ప్రజల ముందుకు రాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

## ఓటర్ల డేటాపైనా విభేదాలు

ఓటర్ల జాబితా నిర్వహణలో అధికారాల కేంద్రీకరణపైనా ఇద్దరు కమిషనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల డేటాబేస్‌పై క్రమంగా కేంద్ర స్థాయిలో నియంత్రణ పెరుగుతోందని వివేక్ జోషి హెచ్చరించనట్టు నివేదిక పేర్కొంది. చట్టబద్ధ అధికారులైన రాష్ట్ర స్థాయి ఎన్నికల అధికారులకు ఓటర్ల డేటాపై పూర్తి స్థాయి యాక్సెస్ ఉండాలని ఆయన సూచించారు. సుఖ్‌బీర్ సంధు కూడా ఈ అంశాన్ని మరోసారి ప్రస్తావించారు. ఓటర్ల జాబితాను నిర్వహించే సాఫ్ట్‌వేర్‌పై నియంత్రణ ఢిల్లీలో కేంద్రీకృత మైతే.. క్షేత్రస్థాయిలోని ఎన్నికల అధికారుల నిర్ణయాలకు కూడా సాంకేతిక వ్యవస్థ అడ్డంకిగా మారే పరిస్థితి ఏర్పడు తుందని విశ్లేషకులు వివరించారు. గోవాలో అర్హత ఉన్న 97 మంది ఓటర్ల విషయంలో అధికారులు నిర్ణయం తీసు కున్నప్పటికీ సాఫ్ట్‌వేర్‌లో ఆ నిర్ణయాలను నమోదు చేయ లేని పరిస్థితి ఏర్పడినట్టు ఆంగ్ల వార్తా సంస్థ కథనం పేర్కొంది.

## క్యాబినెట్ కార్యదర్శి వరకు వెళ్లిన విభేదాలు

ఎన్నికల కమిషన్‌లో విభేదాలు ఎంత తీవ్రంగా ఉన్నాయో మరో విషయం స్పష్టం చేస్తోంది. ఓటర్ల డేటాకు సంబంధించిన ఐటీ వ్యవస్థపై పర్యవేక్షణను ప్రభావితం చేసేలా పని విభజనలో మార్పులు జరిగాయని పేర్కొంటూ సంధు, జోషి విడివిడిగా క్యాబినెట్ కార్యదర్శిని సంప్ర దించారు. ఈ మార్పులు తమకు తెలియకుండానే జరిగాయని వారు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు సమాచారం.

## మోడీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల విమర్శలు

ఈ పరిణామాలు కేంద్రంలోని మోడీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల విమర్శలకు మరింత పదును పెట్టాయి. ఎన్నికల కమిషనర్ల నియామక విధానంలో కేంద్ర ప్రభుత్వానికి ఎక్కువ అధికారం కల్పించే చట్టం వచ్చిన తర్వాత ప్రస్తుత కమిషనర్లు నియమితులయ్యారని ప్రతిపక్షాలు గతంలో విమర్శించాయి. తాజా అంతర్గత విభేదాలను చూపిస్తూ ఎన్నికల కమిషన్ స్వతంత్రతపై మళ్లీ ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. అయితే ఎన్నికల కమిషన్ ఈ అభ్యంతరాలను 'సాధారణ అంతర్గత సూచనలు'గా అభివర్ణించింది.

## ప్రజాస్వామ్యానికి కీలకమైన ప్రశ్న

ఎన్నికల కమిషన్‌లో ఇద్దరు సభ్యులు పదేపదే అభ్యంతరాలు వ్యక్తం చేయడం కేవలం అంతర్గత పరిపాలనా వ్యవహారంగా ముగిసిపోవాల్సిన అంశం కాదని రాజకీయ నిపుణులు చెప్తున్నారు. ఓటు హక్కుకు సంబంధించిన నిర్ణయాలు ఎలా తీసుకుంటున్నారు? ఓటర్ల డేటాపై ఎవరి నియంత్రణ ఉంది? కొత్త ఓటర్ల నమోదులో ఎలాంటి ప్రమాణాలు అమలు చేస్తున్నారు? ఇప్పటికే ఓటర్ల జాబితాలో ఉన్న పేర్లను తొలగించేందుకు ఎవరు అప్పీళ్లు చేస్తున్నారు? అనే ప్రశ్నలకు ప్రజలకు స్పష్టమైన సమాధానాలు అవసరమని వారు అంటున్నారు. ఓటర్ల జాబితా విషయంలో చిన్న అనుమానం కూడా ప్రజాస్వామ్యంపై పెద్ద ప్రశ్నగా మారుతుందనీ, అందుకే సర్‌పై రాజకీయ ఆరోపణలకంటే ముందుగా.. ఎన్నికల కమిషన్‌లో ఇద్దరు సభ్యులు లేవనెత్తిన 14 అభ్యంతరాలకు పూర్తి సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఇప్పుడు మరింత స్పష్టంగా కనిపిస్తోందని సూచిస్తున్నారు.

## బెంగాల్‌లో 16.10 లక్షల అప్పీళ్లపై ప్రశ్న

పశ్చిమ బెంగాల్‌లో సర్ సమయంలో మరో కీలక అంశంపైనా సంధు ప్రశ్నలు లేవనెత్తారు. ఓటర్ల జాబితాలో చేర్చిన వారి పేర్లను తొలగించాలని కోరుతూ 16.10 లక్షల అప్పీళ్లు దాఖలయ్యాయి. ఈ అప్పీళ్లను ఎవరు దాఖలు చేశారు? ఎన్నికల కమిషన్ తరఫున వాటిని దాఖలు చేయడానికి ఎవరు అనుమతిచ్చారు? అనే ప్రశ్నలను సంధు అధికారులను అడిగారు. ఈ ప్రక్రియ గురించి తనకు, మరో కమిషనర్ జోషికి, బెంగాల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌కు సమాచారం లేదని కూడా ఆయన చెప్పినట్టు తెలిసింది.

బెంగాల్‌లో సర్ కారణంగా పేర్లు తొలగించబడిన 22.21 లక్షల మంది ఓటర్లు తమ పేర్లను తిరిగి చేర్చాలని అప్పీల్ చేసినట్టు ఈసీ సుప్రీంకోర్టుకు తెలిపింది. అదే సమయంలో మరో 16.10 లక్షల అప్పీళు ఇప్పటికే చేర్చిన ఓటర్ల పేర్లను తొలగించాలని కోరుతున్నాయి. ఈ అప్పీళ్లను ఎవరు దాఖలు చేశారన్న ప్రశ్నకు మాత్రం స్పష్టత లేదని తాజా నివేదికలు పేర్కొంటున్నాయి.

# ఈసీల నియామకంపై సుప్రీం భిన్న తీర్పు

(మొదటిపేజీ తరువాయి)

ఏకాభిప్రాయానికి వచ్చారు. 2023లో పార్లమెంట్ ఆమోదించిన చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల (నియామకం, సేవా నిబంధనలు, పదవీకాలం) చట్టంలో సీఈసీ, ఈసీల నియామక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానంలో ప్రధానమంత్రి నామినేట్ చేసే కేంద్ర మంత్రిని చేర్చారు. ప్రస్తుతం ఈ కమిటీలో ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత, ప్రధానమంత్రి నామినేట్ చేసిన కేంద్ర మంత్రి సభ్యులుగా ఉంటారు. ఈ మార్పునే పిటిషనర్లు సవాల్ చేశారు.

## స్వతంత్రతపై జస్టిస్ దత్తా అభిప్రాయం

కేంద్రం కోరిన విధంగా కేసును పెద్ద ధర్మాసనానికి పంపాల్సిన అవసరం లేదని జస్టిస్ దీపాంకర్ దత్తా అభిప్రాయపడ్డారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా పని చేయడం మాత్రమే కాకుండా, అది స్వతంత్రంగా పని చేస్తుందనే నమ్మకం ప్రజల్లో కనిపించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రధానమంత్రి నామినేట్ చేసే కేంద్ర మంత్రి అదే ప్రభుత్వంలో భాగంగా ఉన్నందున ప్రధానమంత్రికి వ్యతిరేకంగా స్వతంత్రంగా వ్యవహరిస్తారని ఆశించడం కష్టమని జస్టిస్ దత్తా వ్యాఖ్యానించారు. అటువంటి వ్యవస్థలో తటస్థ సభ్యుడు అందించే స్వతంత్ర ప్రతిస్పందనకు సమానమైన సమతుల్యత ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసం అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సంఘం స్వతంత్రంగా ఉండటమే కాకుండా, అది స్వతంత్రంగా ఉందనే భావన కూడా ప్రజల్లో ఉండాలని స్పష్టం చేశారు.

## పెద్ద ధర్మాసనం అవసరమన్న జస్టిస్ శర్మ

మరోవైపు జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ పిటిషన్లలో గణనీయమైన రాజ్యాంగపరమైన ప్రశ్నలు ఉన్నందున వాటిని పెద్ద ధర్మాసనం తేల్చాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 145(3) ప్రకారం కనీసం ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ అంశాన్ని పరిశీలించాల్సి ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇద్దరు న్యాయమూర్తుల మధ్య అభిప్రాయ భేదం ఉన్నప్పటికీ, ఈ వ్యవహారాన్ని మరో చిన్న ధర్మాసనం వద్దకు పంపి, ఆ తర్వాత మళ్లీ రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే ప్రక్రియ వల్ల మరింత జాప్యం జరిగే అవకాశం ఉందని కోర్టు పేర్కొంది. అందువల్ల నేరుగా సీజేఐ వద్దకు పంపి తగిన రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించింది.

## 'అనూప్ బరన్వాల్' తీర్పు నేపథ్యంలో

ఈ వివాదానికి 2023లో సుప్రీంకోర్టు ఇచ్చిన అనూప్ బరన్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పు కీలక నేపథ్యంగా ఉంది. పార్లమెంట్ చట్టం చేసే వరకు సీఈసీ, ఈసీల నియామకానికి ప్రధానమంత్రి, లోక్‌సభ ప్రతిపక్ష నేత, సీజేఐలతో కూడిన కమిటీని సుప్రీంకోర్టు సూచించింది. అయితే అనంతరం పార్లమెంట్ 2023లో కొత్త చట్టం తీసుకువచ్చి సీజేఐ స్థానంలో ప్రధానమంత్రి నామినేట్ చేసే కేంద్ర మంత్రిని నియామక కమిటీలో చేర్చింది. ?ఈ మార్పుతో నియామ క కమిటీలో ప్రభుత్వానికి చెందిన ఇద్దరు సభ్యులు, ప్రతిపక్షానికి చెందిన ఒక సభ్యుడు ఉండే పరిస్థితి ఏర్పడిందని పిటిషనర్లు వాదిస్తున్నారు. మరోవైపు, పార్ల మెంట్ తన శాసనాధికార పరిధిలోనే కొత్త నియామక వ్యవస్థను రూపొందించిందని కేంద్ర ప్రభుత్వం వాదించింది. అనూప్ బరన్వాల్ తీర్పు శాసనపరమైన ఖాళీని భర్తీ చేయడానికి మాత్రమే తాత్కాలిక వ్యవస్థను ఏర్పాటు చేసిందని కేంద్రం పేర్కొంది.

## రాజ్యాంగ కేసుల జాప్యంపై సుప్రీం ఆందోళన

పెద్ద ధర్మాసనాలకు పంపుతున్న రాజ్యాంగపరమైన కేసుల విచారణలో జాప్యం జరుగుతున్న అంశాన్ని కూడా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. కొన్ని రాజ్యాంగపరమైన అంశాలు ఏండ్ల తరబడి పెండింగ్‌లో ఉంటున్నాయన్న ఆందోళనను ధర్మాసనం వ్యక్తం చేసింది. రాజ్యాంగ కేసుల విచారణ కోసం శాశ్వతంగా ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం ఏర్పాటు చేసే అంశాన్ని సీజేఐ పరిశీలించాలని కోరింది. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం చెల్లుబాటు, ఎన్నికల సంఘం స్వతంత్రతకు రాజ్యాంగపరమైన రక్షణ, నియామక ప్రక్రియలో ప్రభుత్వ--ప్రతిపక్షాల పాత్ర వంటి కీలక అంశాలపై తుది నిర్ణయం ఇక రాజ్యాంగ ధర్మాసనం పరిధిలోకి వెళ్లనుంది.

# పంచ సూత్రాలతో అమరావతి నిర్మాణం..

(మొదటిపేజీ తరువాయి)

మన అమరావతికి రావడం గర్వకారణం" అని అన్నారు. ఈ సంస్థకు 12 ఎకరాల భూమి కేటాయించామని, భవిష్యత్తులో అవసరమైతే మరిన్ని భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. "అమరావతిలో ఏర్పాటయ్యే ఈ కేంద్రం ప్రపంచంలోనే నెం.1గా నిలవాలి.

చికిత్స, పరిశోధన, పునరావాసం.. ఇలా కంటికి సంబంధించిన ఏ విషయంలోనైనా ప్రపంచం అమరావతి వైపు చూడాలి" అని ఆయన ఆకాంక్షించారు. సంవత్సరానికి మూడు లక్షల మందికి సేవలు అందించడమే కాకుండా, పరిశోధన, విద్య, శిక్షణ, కమ్యూనిటీ ఐ హెల్త్ వంటి విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ బృహత్కార్యానికి మూలపురుషులైన డాక్టర్ జి.ఎన్. రావు, ప్రధాన దాత జాస్తి వెంకటేలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

## ఐదు సూత్రాలతో అమరావతి నిర్మాణం

అమరావతి కేవలం ఒక నగరం కాదని, అది ఒక భవిష్యత్ దర్శనమని చంద్రబాబు అన్నారు. ఐదు ప్రధాన సూత్రాల (పంచ సూత్రాలు) ఆధారంగా నగరాన్ని నిర్మిస్తున్నట్లు వివరించారు.

1. **నో పోల్ సిటీ:** విద్యుత్, టెలిఫోన్ తీగలన్నీ భూగర్భంలోనే ఉంటాయి. వీధుల్లో స్తంభాలు కనిపించవు.
2. **బ్లూ సిటీ:** కృష్ణా నది, ఇన్ లాండ్ కాలువలతో నగరం జలకళతో ఉట్టిపడుతుంది. గోదావరి-కృష్ణా అను సంధానంతో నదిలో నీటికి కొరత ఉండదు.
3. **గ్రీన్ సిటీ:** నగరంలో 50% పైగా పచ్చదనం ఉంటుంది. ఇక్కడి నేల స్వభావం వల్ల పచ్చదనం ఏపుగా పెరిగి ఆహ్లాదకర వాతావరణాన్ని అందిస్తుంది.
4. **గ్రీన్ ఎనర్జీ:** కాలుష్య రహిత, పునరుత్పాదక ఇంధనాన్ని మాత్రమే వినియోగిస్తాం. నగరాన్ని నెట్-జీరో కార్బన్ సిటీగా తీర్చిదిద్దుతాం. ఇక్కడ నివసించే వారి ఆయుష్షు 25 ఏళ్లు పెరుగుతుంది.
5. **డీప్ టెక్నాలజీ:** అత్యాధునిక సాంకేతికతను జీవితంలోని ప్రతి అణువులో భాగం చేస్తాం.

## టెక్నాలజీ హబ్‌గా అమరావతి

గతంలో తాను ఐటీకి ప్రాధాన్యత ఇస్తే, ఇప్పుడు క్వాంటం కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ వంటి డీప్ టెక్నాలజీలపై దృష్టి సారించినట్లు సీఎం తెలిపారు. "ప్రపంచంలో ఆరు దేశాల్లో మాత్రమే ఉన్న క్వాంటం టెక్నాలజీని అమరావతికి తీసుకొచ్చాం. ఐబీఎం, టీసీఎస్ వంటి సంస్థలతో కలిసి 133 క్యూబిట్ సామర్థ్యంతో క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే 21 క్వాంటం స్టార్టప్‌లు వచ్చాయి. అక్టోబర్ 3న ఐదు కళాశాలల్లో మన వాళ్లు తయారు చేసిన క్వాంటం కంప్యూటర్లను ప్రారంభిస్తున్నాం.

మన యువతకు ప్రోత్సా హం ఇస్తే ప్రపంచాన్నే జయిస్తారు" అని ఆయన అన్నారు. స్పేస్ సిటీ, డ్రోన్ సిటీ, సెమీ కండక్టర్ క్లస్టర్లతో అమరా వతి భవిష్యత్ సాంకేతికతకు చిరునామాగా మారుతుందన్నారు.

## విజ్ఞానం, ఆరోగ్యానికి కేంద్రం

అమరావతిని ఒక నాలెడ్జ్ ఎకానమీ, హెల్త్ కేర్ ఎకోసిస్టమ్‌గా తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు తెలిపారు. "ఇప్పటికే ఎస్ఆర్ఎం, విట్, అమృత యూనివర్సిటీలు వచ్చాయి. త్వరలో బిట్స్ పిలానీ, ఎక్స్ఎల్ఆర్ఐ వంటి సంస్థలు రాబోతున్నాయి. మరోవైపు ఎయిమ్స్, బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్, కిమ్స్, ఇప్పుడు ఎల్వీ ప్రసాద్ వంటి సంస్థలతో అమరావతి గ్లోబల్ హెల్త్ హబ్‌గా మారుతుంది. రేపు ప్రపంచమంతా వైద్యం కోసం అమరావతికి వచ్చే రోజు దగ్గరలోనే ఉంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. రూ.60,000 కోట్ల విలువైన రోడ్లు, ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి మౌలిక సదుపాయాలు నగరాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని వివరించారు.

## రైతుల త్యాగం చరిత్రాత్మకం

రాజధాని నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన రైతులను సీఎం మరోసారి అభినందించారు. "మీరు చేసిన త్యాగం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడింది. ల్యాండ్ పూలింగ్ విధానం, మీ పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి. భావితరాలకు మీరు ఆదర్శంగా నిలుస్తారు" అని కొనియాడారు.

## యువతకు పిలుపు

ఈ కార్యక్రమానికి హాజరైన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, "మనం ఒక స్ఫూర్తిదాయకమైన కాలంలో ఉన్నాం. టెక్నాలజీ, నాలెడ్జ్ అందుబాటులో ఉన్నాయి. కావాల్సిందల్లా సరైన నాయకత్వం. ఆకాశమే హద్దుగా ఆలోచించి, అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ప్రపంచాన్ని జయించే శక్తి మన యువతకు ఉంది" అని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎల్వీ ప్రసాద్ సంస్థ ప్రతినిధులు, దాతలు, రైతులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. 2027 డిసెంబర్ 27 నాటికి ఈ కేంద్రాన్ని పూర్తిచేసి ప్రారంభిస్తామని సంస్థ ప్రతినిధులు హామీ ఇచ్చినట్లు సీఎం తెలిపారు.

# విగ్రహావిష్కరణకే పరిమితమా...
# కరువు సమస్యపై ప్రకటన ఏదీ...?

- రైతుల కరువు కష్టాలపై ఒక్క మాటైనా మాట్లాడలేదని ఆరోపణ
- పేరూరు డ్యామ్‌కు నీళ్లు ఎప్పుడు ఇస్తారో చెప్పాలి
- ఎండిపోతున్న చెరువులు.. వలసబాట పడుతున్న రైతులు కనిపించలేదా?
- రాప్తాడుకు వచ్చి రైతులకు ఏం భరోసా ఇచ్చావ్ లోకేష్ తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి



**అనంతపురం ప్రత్యేక ప్రతినిధి - సూర్య వాస్తవం :** రాప్తాడు నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్ పర్యటనపై మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. లోకేష్ రాప్తాడుకు వస్తున్న నేపథ్యంలో కరువుతో అల్లాడుతున్న రైతులకు భరోసా కల్పించే ప్రకటన చేస్తారని, చెరువులకు నీళ్లు ఇస్తామని లేదా పేరూరు డ్యామ్‌ను నింపుతామని చెబుతారని ఆశించానని, అయితే అలాంటి ప్రస్తావన ఏదీ చేయలేదని అన్నారు.రైతులకు నీళ్లు, భరోసా అనే పదాలకు లోకేష్ నిఘంటువులో అర్థం లేదా? అని ప్రశ్నించారు. రాప్తాడుకు ఎందుకు వచ్చారని ప్రశ్నిస్తూ కేవలం పరిటాల రవి విగ్రహావిష్కరణకే పరిమితమయ్యారని విమర్శించారు. జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు ఇక్కడి కరువు పరిస్థితులు, వలస వెళ్తున్న రైతులు, ఎండిపోతున్న చెరువులు, పంట పొలాల గురించి మాట్లాడాల్సిన బాధ్యత ఉందన్నారు. తాను గతంలో నిర్వహించిన జలదీక్ష సందర్భంగా పేరూరు డ్యామ్‌కు నీళ్లు ఇస్తే రాప్తాడు నియోజకవర్గంలోని పంచాయతీ లన్నింటినీ బేషరతుగా అప్పగిస్తానని ప్రకటించిన విషయాన్ని ప్రకాశ్‌రెడ్డి గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కూడా రైతులకు నీరు అందించడంపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో పేరూరు డ్యామ్‌కు నీరు అందించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. రైతుల వలసలు, కరువు పరిస్థితులపై లోకేష్ స్పందించలేదని విమర్శించారు.అలాగే రాప్తాడు నియోజకవర్గంలో మహిళలు, రైతులు, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని అన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న ఘటనలు, శాంతిభద్రతల పరిస్థితిపై కూడా ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై అరెస్టులు, దౌర్జన్యాలు చేయడం కాకుండా ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు.లోకేష్ తన ప్రసంగాల్లో ప్రతిపక్ష నేతలపై విమర్శలు చేయడం కంటే రైతుల సమస్యలు, సాగునీటి అవసరాలు, కరువు పరిస్థితులపై మాట్లాడాలని ప్రకాశ్‌రెడ్డి అన్నారు. కార్యకర్తలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు మానుకోవాలని సూచిస్తూ, రాప్తాడు నియోజకవర్గానికి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సాగునీటి పనులపై స్పష్టమైన లెక్కలు ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు.

# రోడ్డు భద్రతే ధ్యేయంగా...
# పోలీసుల విస్తృత తనిఖీలు...!

- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు
- అతివేగం, మద్యం మత్తులో డ్రైవింగ్‌పై పోలీసుల నిఘా
- ప్రయాణికుల భద్రతే ప్రథమ లక్ష్యం : ఎస్పీ పి.జగదీష్



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనల అమలే లక్ష్యంగా పోలీసులు బుధవారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. జిల్లా ఎస్పీ శ్రీ జగదీష్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులపై ప్రత్యేక తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసి వాహనదారుల పత్రాలను, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను పోలీసులు పరిశీలించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, అతివేగం, మద్యం మత్తులో వాహనాలు నడపడం, సరైన వాహన పత్రాలు లేకపోవడం తదితర ఉల్లంఘనలపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించే వారు సీటుబెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# అనంతపురం జిల్లాలో తీవ్రమైన కరువుతో
# అల్లాడుతున్న రైతులను ఆదుకోవాలి

- వైసీపీ నాయకులు



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి అనంతపురం జిల్లాలో తీవ్రమై న కరువుతో అల్లాడుతున్న రైతుల ను ఆదుకోవాలని వైసీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు నాగిరెడ్డి,రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భ రత్ కుమార్ రెడ్డి,వైసిపి జిల్లా ఉపా ధ్యక్షురాలు నైరుతి రెడ్డి,రాష్ట్ర వ్యవ సాయ విభాగం కార్యదర్శి మల్లయ్య యాదవ్ పేర్కొన్నారు.బుధవారం గుత్తి,పామిడి మండలంలోని ఎండి పోయిన పంట పొలాలను పరిశీలిం చారు.అనంతరం గుత్తిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం తో పంటలు పూర్తిగా ఎండిపోయా యని,నష్టపోయిన రైతులను ప్రభు త్వమే ఆదుకోవాలని వారు డిమాం డ్ చేశారు.ఈ కార్యక్రమంలో గుత్తి లో రాష్ట్ర వ్యవసాయ విభాగం కా ర్యదర్శి మల్లయ్య యాదవ్, గుత్తి వైసిపి పట్టణ కన్వీనర్ మధుసూదన్ రెడ్డి,గురు ప్రసాద్ యాదవ్,రామ సు బ్బారెడ్డి, అప్పేచెర్ల దస్తగిరి, రమేష్ రెడ్డి, సీవీ రంగా రెడ్డి,డిష్ అన్వర్,వా ల్మీకి శివ,వైసిపి నేతలు పాల్గొన్నారు.



# కనేకల్ టీడీపీ
# సర్పంచ్ సీటు ఎవరిది..?

- సీనియర్--జూనియర్ నేతల ఆసక్తితో వేడెక్కుతున్న రాజకీయ వాతావరణం
- అభ్యర్థిత్వంపై ఆశావహుల మంతనాలు...
- అధిష్ఠానం నిర్ణయంపైనే ఉత్కంఠ
- రసవత్తరం కనేకల్ రాజకీయం..

**కణేకల్ - సూర్య వాస్తవం :** కనేకల్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పదవిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి పెరుగుతోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆశావహులు తమ రాజకీయ సమీ కరణాలపై దృష్టి సారించినట్లు స్థానికంగా చర్చ సాగుతోంది. ముఖ్యంగా టీడీపీలో సీనియర్, జూనియర్ నాయ కులు సర్పంచ్ అభ్యర్థిత్వంపై ఆసక్తి చూపుతున్నారనే ప్రచారం నేపథ్యంలో గ్రామ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. సుదీర్ఘకాలంగా పార్టీ కార్య కలాపాల్లో కొనసాగుతున్న సీనియర్ నాయకులు తమ అనుభవం, పార్టీతో ఉన్న అనుబంధం, కార్యకర్తలతో ఉన్న సంబంధాలను బలంగా నమ్ముకుంటున్నట్లు చర్చ జరుగుతోంది. మరోవైపు యువ నాయకులు తమకున్న ఉత్సాహం, యువతలో పరిచయాలు, ముందుకు తెస్తున్నట్లు తెలుస్తోంది.

**ఎవరికి అవకాశం దక్కేనో?**

సర్పంచ్ అభ్యర్థిత్వం కోసం ఆశావహుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం నిర్ణయం కీలకంగా మారనుంది. అభ్యర్థి ఎంపికలో పార్టీకి ఉన్న పాత అనుబంధాలు, స్థానికంగా నాయకుడికి ఉన్న ఆదరణ, కార్యకర్తల అభిప్రాయాలు, సామాజిక సమీకరణాలు తదితర అంశాలు చర్చకు వచ్చే అవకాశం ఉంది.అయితే ప్రస్తుతానికి ఎవరికి అధికారికంగా అభ్యర్థిత్వం ఖరారైందనే విషయంపై స్పష్టత లేదు. రిజర్వేషన్ తదితర అధికారిక వివరాలు వెలువడిన తర్వాత పోటీపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

**అనుచరుల్లో ఉత్కంఠ**

సీనియర్ నాయకుడి వర్గం, జూనియర్ నాయకుడి వర్గం తమ తమ నేతలకు మద్దతుగా చర్చలు సాగిస్తున్నట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది. దీంతో ఎవరి వెంట ఎంతమంది కార్యకర్తలు ఉన్నారు? ప్రజల్లో ఎవరి పట్ల ఎలాంటి ఆదరణ ఉంది? పార్టీ పెద్దలు ఎవరిని పరిగణనలోకి తీసుకుంటారు? అన్న అంశాలపై గ్రామంలో చర్చలు సాగుతున్నాయి.

**సీటు ఒక్కటే.. ఆశావహులు పలువురు**

మేజర్ గ్రామపంచాయతీ కావడంతో సర్పంచ్ పదవిపై సహజంగానే రాజకీయ ఆసక్తి నెలకొంది. ఒకవైపు సీనియర్ నాయకత్వం తమ అనుభవాన్ని నమ్ముకుంటుండగా, మరోవైపు యువ నాయకత్వం అవకాశాన్ని ఆశిస్తోంది. దీంతో "సీనియారిటీకి ప్రాధాన్యమా.. యువతకు అవకాశమా?" అన్న చర్చ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.ఎన్నికల ప్రక్రియ ముందుకు సాగే కొద్దీ స్థానిక రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉంది.

చివరకు పార్టీ నిర్ణయం ఎటువైపు ఉంటుందన్నది ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం మాత్రం కనేకల్ మేజర్ పంచాయతీ సర్పంచ్ సీటు కోసం సీనియర్--జూనియర్ పోటీ రాజకీయ చర్చల్లో హాట్‌టాపిక్‌గా నిలుస్తోంది. కణేకల్ టీడీపీ సర్పంచ్ సీటు ఎవరికి దక్కనుందన్న చర్చ మాత్రం రోజురోజుకూ ఆసక్తిని పెంచుతోంది.

# నేటితో ముగియనున్న
# జెడ్పీ పాలకవర్గ పదవీకాలం...

- ఉమ్మడి అనంతపురం జెడ్పీకి చివరి చైర్‌పర్సన్‌గా బోయ గిరిజమ్మ
- అనంతపురం జెడ్పీ స్పెషల్ ఆఫీసర్‌గా కలెక్టర్ ఆనంద్
- శ్రీ సత్యసాయి జెడ్పీకి స్పెషల్ ఆఫీసర్‌గా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్





**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ పాలకవర్గం ఐదేళ్ల పదవీ కాలం గురువారంతో ముగియనుంది. 2020 సెప్టెంబర్ 25న కొలువుదీరిన పాలకవర్గానికి జెడ్పీ చైర్‌పర్సన్‌గా బోయ గిరిజమ్మ, ఇద్దరు వైస్ చైర్మన్లు, 60 మంది జెడ్పీటీసీ సభ్యులు, ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులు ఉన్నారు. పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో గురువారం జెడ్పీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించనున్నారు.

**జిల్లాల పునర్విభజనతో మారిన స్వరూపం**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పార్లమెంట్ నియోజకవర్గాల ప్రాతిపదికన జిల్లాల పునర్విభజన జరిగింది. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలుగా విడిపోయింది. 63 మండలాలతో ఉన్న ఉమ్మడి జిల్లా 31 మండలాలతో అనంతపురం జిల్లాగా, 32 మండలాలతో శ్రీ సత్యసాయి జిల్లాగా ఏర్పడింది.

**ఉమ్మడి జెడ్పీకి చివరి చైర్‌పర్సన్‌గా గిరిజమ్మ**

జిల్లా పరిషత్ చరిత్రలో ప్రస్తుత పాలకవర్గానికి ప్రత్యేక స్థానం ఉంది. ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్‌కు చివరి చైర్‌పర్సన్‌గా బోయ గిరిజమ్మ పదవిలో కొనసాగారు. జిల్లాల విభజన అనంతరం కూడా ఉమ్మడి జెడ్పీ పాలకవర్గం తన ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేసింది. చరిత్రను పరిశీలిస్తే.. 1929 డిసెంబర్ 3న జిల్లా బోర్డు అధ్యక్షుడిగా గుత్తి లక్ష్మీరెడ్డి బాధ్యతలు చేపట్టారు. అనంతరం పలువురు జిల్లా బోర్డు అధ్యక్షులుగా కొనసాగారు. 1962 ఏప్రిల్ 23న జిల్లా ప్రజా పరిషత్‌లు ఆవిర్భవించడంతో జెడ్పీ చైర్మన్ల పాలన ప్రారంభమైంది. ఇప్పటివరకు పలువురు చైర్మన్లు, ఐఏఎస్ అధికారులు ప్రత్యేక అధికారులుగా ఉమ్మడి జిల్లా పరిషత్ బాధ్యతలు నిర్వహించారు.

**పాలకవర్గానికి ఆత్మీయ వీడ్కోలు**

పదవీకాలం ముగియనున్న సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైస్ చైర్మన్లు వేదాంతం నాగరత్నమ్మ, సుధాకర్‌రెడ్డితో పాటు జెడ్పీటీసీ సభ్యులు, కో-ఆప్షన్ సభ్యులకు జెడ్పీ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో కార్యక్రమానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి.

**రేపటి నుంచి కలెక్టర్లకు జెడ్పీ పగ్గాలు**

పాలకవర్గం పదవీకాలం ముగియడంతో శుక్రవారం నుంచి జెడ్పీలలో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభం కానుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు జెడ్పీలకు స్పెషల్ ఆఫీసర్లుగా బాధ్యతలు చేపట్టనున్నారు. అనంతపురం జెడ్పీకి కలెక్టర్ ఆనంద్, శ్రీ సత్యసాయి జెడ్పీకి కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ప్రత్యేక అధికారులుగా వ్యవహరించనున్నారు. కొత్త పాలకవర్గాలు ఎన్నికై బాధ్యతలు చేపట్టే వరకు ఈ ప్రత్యేక అధికారుల పాలన కొనసాగనుంది.

# శభాష్ పోలీస్..




- తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు
- చాకచక్యంగా స్పందించిన అర్బన్ సీఐ దేవానంద్

**రాయదుర్గం - సూర్య వాస్తవం :** పట్టణంలో తప్పిపోయిన ఆరేళ్ల బాలుడిని పోలీసులు సురక్షితంగా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడి ఆచూకీ కోసం పోలీసులు తక్షణమే స్పందించి సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా సమాచారాన్ని విస్తృతంగా ప్రచారం చేయడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసుల సమయస్ఫూర్తి, చొరవకు పలువురు అభినందనలు తెలిపారు.

**రైల్వే స్టేషన్ వద్ద బాలుడి గుర్తింపు**

రాయదుర్గం పట్టణంలోని చంద్రబాబునాయుడు కాలనీకి చెందిన సృజన్ అనే ఆరేళ్ల బాలుడు బుధవారం రైల్వే స్టేషన్ సమీపంలో ఒంటరిగా తిరుగుతూ కనిపించాడు. బాలుడు ఎటువైపు వెళ్లాలో తెలియక ఆందోళనగా ఉండటాన్ని గమనించిన రైల్వే కార్మికులు వెంటనే అప్రమత్తమయ్యారు. బాలుడి భద్రతను దృష్టిలో ఉంచుకుని అతడిని రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి పోలీసులకు అప్పగించారు.

**బాలుడి వివరాలు తెలుసుకునే ప్రయత్నం**

పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న బాలుడిని పోలీసులు ఆప్యాయంగా విచారించి అతడి పేరు, కుటుంబ వివరాలు, నివాస ప్రాంతం తదితర సమాచారాన్ని తెలుసుకునే ప్రయత్నం చేశారు. బాలుడి వయస్సు చిన్నది కావడంతో అతడిని జాగ్రత్తగా చూసుకుంటూ తల్లిదండ్రుల ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు.

**సీఐ దేవానంద్ ప్రత్యేక చొరవ**

అర్బన్ సీఐ దేవానంద్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని బాలుడి కుటుంబ సభ్యులను గుర్తించేందుకు సిబ్బందిని అప్రమత్తం చేశారు. బాలుడి వివరాలను సోషల్ మీడియా, ఫ్రంట్‌లైన్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ప్రచారం చేయించారు. సమాచారం వీలైనంత త్వరగా బాలుడి కుటుంబ సభ్యులకు చేరేలా చర్యలు చేపట్టారు.

**సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు**

పోలీసులు చేసిన ప్రచారం ద్వారా బాలుడు తప్పిపోయిన విషయం కుటుంబ సభ్యులకు తెలిసింది. వెంటనే బాలుడి తల్లి, అమ్మమ్మ రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. పోలీసులు వారి వివరాలను పరిశీలించి, బాలుడితో వారికి ఉన్న సంబంధాన్ని నిర్ధారించుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యుల సమక్షంలో బాలుడిని వారికి అప్పగించారు.

**కుటుంబంలో ఆనందం**

తప్పిపోయిన బాలుడు క్షేమంగా తిరిగి కుటుంబ సభ్యుల చెంతకు చేరడంతో తల్లిదండ్రులు, బంధువులు ఊపిరి పీల్చుకున్నారు. బాలుడిని సురక్షితంగా అప్పగించిన పోలీసులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించి, సమాచారం అందిన వెంటనే స్పందించిన రాయదుర్గం పోలీసుల చర్యను స్థానికులు అభినందించారు.

**"శభాష్ పోలీస్" అంటూ అభినందనలు**

తప్పిపోయిన బాలుడిని గుర్తించి, అతడి తల్లిదండ్రుల ఆచూకీ కోసం తక్షణ చర్యలు చేపట్టి, చివరకు కుటుంబ సభ్యులకు అప్పగించడంలో అర్బన్ సీఐ దేవానంద్ చూపిన చొరవపై ప్రజలు ప్రశంసలు వ్యక్తం చేశారు. పోలీసుల వేగవంతమైన స్పందనతో బాలుడు సురక్షితంగా ఇంటికి చేరడం పట్ల "శభాష్ పోలీస్" అంటూ అభినందనలు తెలిపారు.

# ఉపాధ్యాయులపై దాడులను సహించం

**- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్...!**
**- డీఎస్సీపై అభ్యంతరాలుంటే చట్టబద్ధంగా ఫిర్యాదు చేయాలి**
**- రాజకీయ ప్రయోజనాల కోసం ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టొద్దు**
**- విజయవాడ శాప్ కార్యాలయం వద్ద ఘటనపై తీవ్ర ఆగ్రహం**



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులపై చోటుచేసుకున్న దాడి ఘటనపై తీవ్రంగా స్పందించారు. ఉపాధ్యా యులపై దాడులకు పాల్పడటం దుర్మార్గమని, రాష్ట్రంలో అశాంతి, హింస, రౌడీయిజాన్ని ప్రభుత్వం ఎంతమాత్రం సహించ బోదని పేర్కొన్నారు.

ఈ ఘటనపై పోలీసులు పలు కేసులు నమోదు చేసినట్లు, కొందరిని అదుపులోకి తీసుకున్నట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. డీఎస్సీ నియామకాలపై అభ్యంతరాలు ఉంటే చట్టబద్ధమైన మార్గాల్లో ఫిర్యాదు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. రోడ్లపై ఆందోళనలకు దిగుతూ ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం సమర్థనీయం కాదన్నారు. డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన ప్రతి ఒక్కరికీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో డీఎస్సీ నియామకాలను వేగంగా, పారదర్శకంగా నిర్వహించామని దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. నియామకాలపై అనుమానాలు ఉంటే ఆధారాలతో సంబంధిత అధికారులను ఆశ్రయించాలన్నారు. ఉపాధ్యాయుల గౌరవం, ఉద్యోగ భద్రతను కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. శాప్ కార్యాలయం వద్ద జరిగిన ఘటనకు బాధ్యులైన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులపై దాడులను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవడం సరికాదని ఎమ్మెల్యే అన్నారు.

## టీడీపీ డర్టీ పార్టీ.. డర్టీ పాలిటిక్స్: కేవీ రమణ

**- ఎన్నికల వేళ హామీలతో ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపణ**
**- పట్టణాభివృద్ధికి రూ.50 వేల కోట్ల హామీపై వైసీపీ నేత విమర్శలు**



**అనంతపురం - సూర్య వాస్తవం :** ఎన్నికలు సమీపించిన ప్రతిసారీ చంద్రబాబు ప్రభుత్వం కొత్త హామీలతో ప్రజల ముందుకు వస్తోందని వైఎస్సార్‌సీపీ రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కేవీ రమణ విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలకు, వాటి అమలుకు మధ్య భారీ వ్యత్యాసం ఉందని ఆయన ఆరోపించారు. పట్టణాభివృద్ధికి రూ.50 వేల కోట్ల మేర పనులను చేపట్టనున్నట్లు ముఖ్య మంత్రి చంద్రబాబు ప్రకటించడాన్ని కేవీ రమణ ప్రస్తావిస్తూ.. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలోనే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. అయితే ప్రభుత్వ ప్రకటన ప్రకారం 123 పట్టణ స్థానిక సంస్థల్లో రూ.11,359 కోట్ల విలువైన పనులకు సెప్టెంబర్ 22న శంకుస్థాపన జరిగింది. మొత్తం సుమారు రూ.50 వేల కోట్ల పట్టణాభివృద్ధి పనుల ప్రణాళికలో ఇప్పటికే కొనసాగుతున్న పనులతో పాటు రానున్న నెలల్లో ప్రారంభించనున్న పనులు ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. 2024 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో అనేకం ఇంకా పూర్తిస్థాయిలో అమలు కాలేదని కేవీ రమణ ఆరోపించారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొన్న సమయంలో రైతులు, ప్రజలకు తగిన సహాయం అందించ కుండా భారీ అభివృద్ధి హామీలు ఎలా ఇస్తారని ఆయన ప్రశ్నించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు గౌరవ వేతనాలు, వారు చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని ఆయన ఆరోపించారు. ముందుగా ఇప్పటికే ఉన్న బకాయిలను పరిష్కరించి, ఆ తర్వాత కొత్త అభివృద్ధి హామీలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేయడం, మైక్రో ఇరిగేషన్‌కు భారీగా నిధులు కేటాయించడం వంటి ప్రకటనలపైనా ఆయన ప్రశ్నలు సంధించారు. మైక్రో ఇరిగేషన్ పథకాలు ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అమలవుతున్నాయి. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలను ప్రజలు పరిశీలించి, వాటి అమలు స్థితిగతులను ప్రశ్నించాలని కేవీ రమణ కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే ప్రభుత్వానికి ప్రధాన బాధ్యతగా ఉండాలని ఆయన పేర్కొన్నారు.

## బీసీవై విద్యార్థి విభాగం సత్యసాయి జిల్లా నూతన కమిటీ ఎన్నిక...!

**- కన్వీనర్‌గా ఎం. బాలకృష్ణ.. కో-కన్వీనర్‌గా గంగాధర్ ఏకగ్రీవ ఎన్నిక**
**- విద్యార్థుల ఆత్మహత్యలు, లైంగిక దాడులపై మంత్రి నారా లోకేష్ స్పందించాలి: బీసీ సురేష్ యాదవ్**

**కదిరి - సూర్య వాస్తవం :** బీసీవై పార్టీ విద్యార్థి విభాగం సత్యసాయి జిల్లా నూతన కమిటీని బుధవారం కదిరి పట్టణంలో ఎన్నుకున్నారు. రాష్ట్ర కన్వీనర్ బీసీ సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్‌గా ఎం. బాలకృష్ణ, కో-కన్వీనర్‌గా గంగాధర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బీసీ సురేష్ యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బీసీవై పార్టీ విద్యార్థి విభాగం కృషి చేస్తుందన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్యలు, విద్యార్థులపై లైంగిక దాడుల ఘటనలపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలని కోరారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న విద్యాసంస్థలపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే బీసీవై పార్టీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కో-కన్వీనర్లుగా దాదా పీరా, తాహిర్, ఆసిఫ్, హరికృష్ణ, రాజేంద్ర, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# సీపీఐ కరువు దీక్షలకు... వైసీపీ సంపూర్ణ మద్దతు...!

**- అందరికీ ఏకైక శత్రువు కరువు...**
**- పేరూరు డ్యాంకు నీళ్లు ఇస్తే వందల ఎకరాల పంటలకు ఊరట**
**- కరువుతో వలసలు, ఎండిపోతున్న పంటలపై ఆవేదన**
**- కరువుపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్**
**- రైతుల కోసం రాజకీయాలకు అతీతంగా ఏకం కావాలి: తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి**



**అనంతపురం ప్రత్యేక ప్రతినిధి - సూర్య వాస్తవం :** రైతాంగాన్ని కాపాడుకోవాలంటే రాజకీయ పార్టీలకు అతీతంగా అందరూ 'రైతు పార్టీ'గా ఏకం కావాల్సిన అవసరం ఉందని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. అనంతపురం టవర్‌క్లాక్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కరువుదీక్షలకు బుధవారం ఆయన సంఘీభావం తెలిపారు. ప్రజా సమస్యలపై సీపీఐ చేపట్టే ప్రతి ఉద్యమానికి వైఎస్సార్‌సీపీ సంపూర్ణ మద్దతు ఉంటుందని వెల్లడించారు. అందరికీ ఏకైక శత్రువు కరువేనని, అన్నం పెట్టే రైతు ఆపదలో ఉన్నప్పుడు రాజకీయ భేదాలు పక్కనపెట్టి రైతు కుటుంబాలకు అండగా నిలవాలని ఆయన కోరారు. కరువు పరిస్థితులపై ప్రభుత్వం కనీసం ప్రకటన చేయకపోవడం బాధాకరమన్నారు. తుంగభద్ర డ్యాంలో నీరు అందుబాటులో ఉన్నప్పటికీ పీఏబీఆర్ కుడికాలువకు నీళ్లు విడుదల చేయడం లేదని, పేరూరు డ్యాంకుకు నీరు అందిస్తే వందలాది ఎకరాల పంటలను కాపాడవచ్చని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో వరుసగా మూడు సంవత్సరాలు పేరూరు డ్యాంకు నింపడంతో అనంతపురం నగరం వరకు భూగర్భజలాలు పెరిగాయని గుర్తు చేశారు. మడకశిర బ్రాంచ్ కాలువ ద్వారా నీటిని మళ్లిస్తే పేరూరు డ్యాంకుకు నీరు చేరే అవకాశం ఉందని, ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి సహాయం లేకుండానే దాదాపు 60 కిలోమీటర్ల కాలువ తవ్వి గతంలో నీటిని అందించామని పేర్కొన్నారు. ప్రస్తుతం తీవ్ర కరువుతో పంటలు ఎండిపోతున్నాయని, వేలాది బోర్లు ఎండిపోయాయని, ప్రజలు వలసలు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

హంద్రీనీవా కాలువ లైనింగ్ కారణంగా రైతులకు ఇబ్బందులు ఏర్పడ్డాయని విమర్శించారు. రైతుల సమస్యలపై ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందని, జెండాలు, అజెండాలు పక్కనపెట్టి రైతుల కోసం అందరూ ఒక్కటవ్వాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం పోరాడే వారిపై కేసులు పెట్టినా భయపడబోమని, రైతులకు అండగా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# రబీ సాగులో సమన్వయంతో పనిచేయాలి....

**- తొలకరి వర్షాలను సద్వినియోగం చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలి**



**బెళుగుప్ప - సూర్య వాస్తవం :** రబీ సాగు నేపథ్యంలో గ్రామస్థాయిలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని ఎంపీడీవో లక్ష్మీ నారాయణ సూచించారు. బెళుగుప్ప మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖల గ్రామస్థాయి సిబ్బందికి సమన్వయ సమావేశంతో పాటు ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి పృథ్వీ సాగర్ మాట్లాడుతూ.. గత మూడు రోజులుగా కురిసిన వర్షాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న భూముల్లో ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేందుకు 80 శాతం రాయితీపై ఉలవ, కంది, పెసర, కొర్ర తదితర పంటల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ విషయాన్ని గ్రామస్థాయిలో రైతులకు తెలియజేసి సాగు వైపు ప్రోత్సహించాలని సూచించారు. అలాగే పీఎండీఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్) విధానంపై రైతులకు అవగాహన కల్పించి సాగు చేపట్టేలా చూడాలని కోరారు. పీఎండీఎస్‌లో మిశ్రమ పంటల సాగు చేయడం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు భూసారం పెరుగుతుందని వివరించారు.

**పశుగ్రాసంపై ముందస్తు చర్యలు**

పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో గ్రామాల్లో పశువులకు అవసరమైన పశు గ్రాసం అందుబాటులో ఉందా లేదా అనే అంశాన్ని గ్రామస్థాయి సిబ్బంది ద్వారా తెలుసుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో పశుగ్రాస కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు.

**ప్రకృతి వ్యవసాయంపై అవగాహన**

ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ప్రస్తుతం సాగు చేసే పంటల్లో విత్తనాలను విత్తన బంతులుగా తయారు చేసి పొలాల్లో విత్తుకోవాలని ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది నాగరాజు సూచించారు. ఈ విధానం ద్వారా విత్తనాల మొలక శాతం పెరగడంతో పాటు పంట ఏపుగా పెరిగే అవకాశం ఉంటుందని తెలిపారు. ఏపీవో మురళీకృష్ణ మాట్లాడుతూ.. సాగు చేయని భూముల్లో హాఫ్‌మూన్ మోడల్ పద్ధతిని అమలు చేసి వర్షపు నీటిలో ప్రతి నీటి బొట్టును భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం గ్రామస్థాయిలో అవసరమైన రైతులను గుర్తించి వారి పొలాల్లో హాఫ్‌మూన్ మోడల్‌ను అమలు చేయాలని తెలిపారు.

**రైతులకు అందుబాటులో అధికారులు**

ఎంపీడీవో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల సిబ్బంది గ్రామస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ సరైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు. ప్రస్తుత ఎల్‌నినో ప్రభావంతో నెలకొన్న క్లిష్ట పరిస్థితులను అధిగమించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి పృథ్వీ సాగర్, మండల పశుసంవర్ధక శాఖ అధికారి మంజునాథ్, ఏపీవో మురళీకృష్ణతో పాటు మండలంలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ పశుసంవర్ధక శాఖ సహాయకులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్లు బలవంతపు వసూళ్లకు పాల్పడితే చర్యలు తప్పవు

**- సీఐ కౌలుట్లయ్య**
**- వ్యాపారులతో త్రీటౌన్ పోలీసుల సమావేశం**
**- దసరా మామూళ్ల పేరిట వేధిస్తే కఠిన చర్యలు**
**- వ్యాపారులు భయపడొద్దు... అండగా ఉంటాం**



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** విజయదశమి పండుగను పురస్కరించుకుని అనంతపురం త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వ్యాపారులు, దుకాణదారులతో సీఐ కౌలుట్లయ్య బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎస్సైలు, పోలీస్ సిబ్బందితో కలిసి స్థానిక త్రీటౌన్ లో నిర్వహించిన ఈ సమావేశానికి స్థానిక హోటళ్లు, కిరాణా షాపులు, మెడికల్ షాపులు మరియు జనరల్ స్టోర్స్ యజమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ కౌలుట్లయ్య మాట్లాడుతూ... దసరా పండుగ పేరుతో హిజ్రాలు (ట్రాన్స్‌జెండర్లు) ఎవరైనా షాపుల వద్దకు వచ్చి హల్‌చల్ చేస్తూ, బలవంతంగా ఎక్కువ మొత్తంలో డబ్బులు డిమాండ్ చేస్తే వెనువెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వ్యాపారులను ఇబ్బందులకు గురిచేసే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భద్రతా చర్యల్లో భాగంగా ప్రతీ హోటల్ యజమాని తమ ప్రాంగణాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అవి ఎల్లప్పుడూ పనిచేసేలా చూసుకోవాలని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల అదుపునకు వ్యాపారులంతా పోలీసు శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

## ఆలిండియా లాయర్స్ యూనియన్ నూతన కమిటీ ఎన్నిక....

**- ఆదోని నూతన కమిటీకి అధ్యక్షుడిగా ఖాలందర్**
**- న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం**

**ఆదోని - సూర్య వాస్తవం :** న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరంతరం పోరాటం చేస్తామని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కుమార్ తెలిపారు. ఆదోనిలో నిర్వహించిన న్యాయ వాదుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆదోని ఆలిండియా లాయర్స్ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. అధ్యక్షుడిగా ఖాలందర్, ప్రధాన కార్యదర్శిగా సాయికుమార్, ఉపాధ్యక్షులుగా మధు సూదన్, అజయ్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా హుస్సేన్‌సాని, విష్ణు కశ్యప్, కోశాధికారిగా ఆసిఫ్, క్రీడా కార్యదర్శిగా మల్లి ఎన్నికయ్యారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ముఖ్యంగా జూనియర్ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురుసీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



## కరువు రైతులను తక్షణమే ఆదుకోవాలి : నైరుతిరెడ్డి

**- ఎండిపోతున్న పంట పొలాలను పరిశీలించిన వైసీపీ రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు నాగిరెడ్డి.**





**పామిడి - సూర్య వాస్తవం :** రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర కరువు పరి స్థితుల నేపథ్యంలో రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదు కోవాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు నాగిరెడ్డి పామిడి మండలం గజంపల్లి గ్రామంలోని పంట పొలాలను పరిశీలించుటకు వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ,,,,మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు గుంతకల్లు నియోజకవర్గంలోని గుత్తి, పామిడి మండలాల్లో ఎండిపోతున్న పంటపొలాలను వైఎస్సార్‌సీపీ నేతలు బుధవారం పరిశీలించారు. గుంతకల్లు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి సూచనల మేరకు నిర్వహించిన రైతు విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భరత్‌కుమార్ రెడ్డి, అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి పాల్గొన్నారు. నైరుతిరెడ్డి నేతృత్వంలో గుత్తి, పామిడి మండలాల్లోని వివిధ గ్రామాల్లో పంట పొలాలను,వర్షాభావ పరిస్థితులు, పంటల స్థితిగతులు, సాగుకోసం రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను రైతులను అడిగి తెలుసుకున్నారు. సాగుకు పెట్టుబడులు పెట్టినప్పటికీ వర్షాలు లేక పంటలు దెబ్బతింటున్నాయని పలువురు రైతులు తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షులు నాగిరెడ్డి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతిరెడ్డి కలిసి మీడియాతో మాట్లాడారు కరువు పరిస్థితులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి రైతులకు అవసరమైన సహాయ చర్యలు చేపట్టాలని వారు కోరారు. పంట నష్టాన్ని క్షేత్రస్థాయిలో అంచనా వేసి, అర్హత కలిగిన రైతులకు తగిన సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, కరువు ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు.ఈ పర్యటనలో గుంతకల్లు, గుత్తి ప్రాంతాలకు చెందిన వైసిపి రైతు సంఘం నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా డా. ఉమర్ ముక్తార్ జన్మదిన వేడుకలు



**పామిడి - సూర్య వాస్తవం :** టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నూలు నియోజకవర్గ పరిశీలకులు చమన్ సాబ్ ఫౌండేషన్ చైర్మన్ చమన్ సాబ్ కుమారుడు డా.ఉమర్ ముక్తార్ జన్మదిన వేడుకలను పామిడి మండలంలో పరిధిలో సుంకులమ్మ గుడి దగ్గర టీడీపీ నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ గౌస్ పీరా ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో నాయకులు కార్యకర్తలు పాల్గొని డా. ఉమర్ ముక్తార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా అవకాశం కల్పించిన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డా. ఉమర్ ముక్తార్ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, భవిష్యత్తులో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపు కోవాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ బొమ్మ మోహన్ బొల్లు శ్రీనివాస్ రెడ్డి, ఒకటో వార్డు మాజీ కౌన్సిలర్ ప్రసాద్, రంగస్వామి, వెంకటేష్ చౌదరి, లాలప్ప, రామంజి, వలిపి రామంజి, ఓబులేసు, మారిన బాబు, పశువుల శ్రీరాములు, దూదేకుల రఫీ, రామాంజనేయులు, రామంజి, నాలుగో వార్డు రవి, మురళి, సురేష్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీ జంగం పుల్లారెడిని పరామర్శించిన నైరుతి రెడ్డి

**పామిడి - సూర్య వాస్తవం :** గుంతకల్ నియోజకవర్గం పామిడి మండలం గజనాంపల్లి గ్రామం వైస్సార్సీపీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ ఎంపీపీ జంగం పుల్లారెడ్డి ని పరామర్శించిన జిల్లా ఉపాధ్యక్షురాలు వై నైరుతి రెడ్డి రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షులు నాగిరెడ్డి జిల్లా నాయకులు పెమ్మక చెన్నకేశవ రెడ్డి మల్లయ్య యాదవ్, సాయినాథ్ రెడ్డి , వడుగురు బాబు నీలం గోపాల్ రెడ్డి, బయపరెడ్డి, రూరల్ కన్వినర్ రామకృష్ణ నాయక్, రమణ రెడ్డి, మాజీ సర్పంచులు నాగేశ్వర్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి,నియోజకవర్గం నాయకులు బాబురావ్, రంగనాయకులు, నీలం నారప రెడ్డి, వైస్ ఎంపీపీ ఓబిలేసు, సంజీవ రెడ్డి, మీసాల రామచంద్ర, హనుమంత రెడ్డి తుల్లా బాయ్,ప్రసాద్ వైయస్సార్సీపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి

**- ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్...!**
**- 62 డివిజన్లు, 4 పంచాయతీల్లో విజయమే లక్ష్యం**
**- కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి వివరించాలి**
**- పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేయాలి: ఎమ్మెల్యే**





**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని 62 డివిజన్లు, నాలుగు పంచాయతీల్లో విజయం సాధించడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ పార్టీలో ఎక్కడా అంతర్గత విభేదాలకు తావివ్వకూడదని సూచించారు. ప్రతి డివిజన్, పంచాయతీలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని అన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం, గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యకర్తలకు ఎలాంటి సమస్య వచ్చినా అండగా ఉంటానని తెలిపారు.రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజల్లో విస్తృతంగా పర్యటించాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని అన్నారు. స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తూ ప్రజలతో నిరంతరం మమేకం కావాలని సూచించారు.పార్టీ అధిష్ఠానం ఆదేశాలను పాటిస్తూ ఐక్యంగా పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయం సాధించే దిశగా ముందుకు సాగాలని దగ్గుపాటి ప్రసాద్ పిలుపు నిచ్చారు.సమావేశంలో మాజీ రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, రాష్ట్ర కార్యదర్శి సంగా తేజస్విని, నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, జిల్లా కమిటీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, ఆలయ కమిటీ చైర్మన్లు, డైరెక్టర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సోలార్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం





**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి మండల పరిధిలోని కొండాపురం గ్రామం నందు ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద 40 ఎస్సీ కాలనీకి ఉన్న గృహాలకు ఉచిత సోలార్ విద్యుత్ ప్రారంభోత్సవానికి కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పాల్గొన్నారు.అనంతరం కొండాపురం టిడిపి నాయకులు గ్రామ ప్రజలు ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికారు. కొండాపురం గ్రామంలో వెలిసిన సుంకులమ్మ అమ్మవారిని దర్శించుకొని అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ కుటుంబ గృహాలకు రాష్ట్ర ప్రభుత్వం మరియు పథకం నిబంధనల ద్వారా మరిన్ని ప్రత్యేక రాయితీలు మరియు రవాణా ప్రయోజనాలు అందుతాయని. అదనపు ఆదాయం మీరు ఉత్పత్తి చేసిన విద్యుత్ మీ వినియోగం కంటే ఎక్కువగా ఉంటే మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించి ఆదాయం కూడా పొందవచ్చు అని తెలియజేశారు. అలాగే స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయం లేదా సంబంధిత విద్యుత్ సిబ్బందిని అధికారులను సంప్రదించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ షర్మిల,ఎంపీడీవో ప్రభాకర్ నాయక్,ట్రాన్స్కో డి ఈ పద్మనాభం పిల్లి ఏ ఈ మధుసూదన్ రావు, మండల్ డిప్యూటీ ఎంపీడీవో అశ్వత్త నాయుడు పంచాయతీ ఈవో శివమూర్తి టిడిపి నాయకులు ప్రభాకర్ చౌదరి,,జింకల సంజీవ,బొల్లు శ్రీనివాస్ రెడ్డి, గౌస్ పీరా బొమ్మ మోహన్.అంజి నాయక్ రాజశేఖర్ గౌడ్ ఆర్కే రవి మాలిక్ భాష, రాజు,శ్రీనివాసులు,అశోక్, కూటమి నాయకులు కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వీఆర్‌ఏల నిరసనకు బీఎస్పీ సంఘీభావం



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్న వీఆర్‌ఏలకు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వీఆర్‌ఏలు చేపడుతున్న నిరసనకు బహుజన్ సమాజ్ పా ర్టీ (బీఎస్పీ) నాయకులు బుధవారం సంఘీభావం తెలిపారు. బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి విజయ్ కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకు న్నారు.ఈ సందర్భంగా విజయ్ రామాంజనేయులు మాట్లాడుతూ వీ ఆర్‌ఏలు చాలాకాలంగా ప్రభుత్వా నికి తమ సమస్యలను విన్నవిస్తు న్నప్పటికీ పరిష్కారం లభించకపోవ డంతో నిరసనకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామస్థాయిలో ప్ర భుత్వానికి,ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న వీఆర్‌ఏల సమస్య లను ప్రభుత్వం వెంటనే పరిష్కరిం చాలని కోరారు.వీఆర్‌ఏలు ఎదు ర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి,వారిన్యా యమైన డిమాండ్లపై స్పష్టమైన నిర్ణ యం తీసుకోవాలని డిమాండ్ చేశా రు.నిరసన చేస్తున్న ఉద్యోగులపై ఎ లాంటి ఒత్తిళ్లు లేకుండా వారి సమస్యల పరిష్కారానికి చర్చలు జరపాలని సూచించారు. వీఆర్‌ఏల పోరా టానికి బీఎస్పీ తరఫున అండగా ఉంటామని విజయ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కొండయ్య సుధాకర్ కార్యకర్తలు,వీ ఆర్‌ఏల సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కౌరువును జాతీయ విపత్తుగా ప్రకటించాలి

**- అనంతపురం జిల్లా రైతాంగాన్ని ప్రజలని ఆదుకోవాలి**
**- సీపీఐ, సీపీఎం, అఖిల భారత రైతు కూలీ సంఘం**



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి సీపీఐ, సీపీఎం, అఖిల భారత రైతు కూలీ సంఘం పార్టీల ఆధ్వర్యంలో సామూహిక దీక్షలు మూడ వరోజు, నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడు తూ అనంతపురం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి రైతాంగాన్ని, గ్రామీణ ప్రాంత ప్రజలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాల ని డిమాండ్ చేస్తూ గుత్తి, తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించిన సామూహిక దీక్షలు మూడవ రోజు బుధవారం విజయవంతంగా కొనసాగాయి.సెప్టెంబర్ 21,22,23, తేదీలలో నిర్వహించిన ఈ సామూ హిక దీక్షల్లో కరువు పరిస్థితుల కార ణంగా రైతులు,వ్యవసాయ కూలీ లు,గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే ప రిష్కరించాలని డిమాండ్ చేశారు.

**ప్రధాన డిమాండ్లు:**

1.పశువుల కోసం పశుగ్రాస కేంద్రా లను ఏర్పాటు చేయాలి,2.రైతుల అన్ని రకాల బ్యాంకు రుణాలను ర ద్దు చేయాలి,3.గ్రామీణ ప్రాంత కూ లీలకు ఉపాధి హామీ పనులు విస్తృ తంగా కల్పించాలి,4.గ్రామీణ ప్రాంత రైతులు,కూలీలకు కరువు పింఛన్లు అందించాలి,5.పంట నష్టం పరిహా రం అందించడంతో పాటు పంట బీ మాను అమలు చేయాలి,6.అవస రమైన ప్రతి గ్రామంలో ప్రజలకు ఉ చితంగా తాగునీరు అందించాలి,7. గుత్తి మండలంలోని అన్ని చెరువు లకు నీటిని అందించాలి,8.కరువు ప్రాంతాల విద్యార్థులకు ఫీజులు ర ద్దు చేయాలి,కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్ష ణమే స్పందించి. పై డిమాండ్లను ప రిష్కరించాలని.డిప్యూటీ తాసిల్దార్ సూర్యనారాయణకి మెమోరండం స మర్పించడం జరిగింది.ఈ కార్యక్ర మంలో,సిపిఐ మండల కార్యదర్శి, రామదాసు, రైతు సంఘం నియోజ కవర్గ,అధ్యక్షులు,వెంకటరాముడు, సిపిఎం నాయకులు,మల్లికార్జున, మహిళా సమైక్య నియోజకవర్గ కా ర్యదర్శి,మహమ్మదా,అఖిల భారత రైతు సంఘం నాయకులు, రామాం జనేయులు, ధనుంజయ, నజీర్, బెస్త శివకుమార్, సీనియర్ నాయకులు, టిఎం భాష, తదితరులు ఈ కార్య క్రమంలో పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయం....

**- మండల కన్వీనర్ సునీల్, పెద్ద తిప్పయ్య మల్లికార్జున**
**- స్థానిక ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేయాలి**

**బెళుగుప్ప - సూర్య వాస్తవం:** పేదల సంక్షేమమే టీడీపీ ధ్యేయమని ఆ పార్టీ మండల కన్వీనర్ సునీల్, జిల్లా నాయకులు పెద్ద తిప్పయ్య పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ల మంజూరు, సూపర్ సిక్స్ హామీల అమలుపై హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం స్థానిక ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీ కార్యకర్తలు ఐక్యంగా పనిచేసి టీడీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో బాలాజీ, శశిభూషణ్, కిష్టయ్య, తిప్పేస్వామి, శీర్పి వెంకటేశులు తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అగ్రిగోల్డ్ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**- ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్**



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** అగ్రిగోల్డ్ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కోటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది అంటూ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు సత్య కుమార్ యాదవ్ తెలిపారు.మంత్రి బుధవారం ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కారంపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌తో పాటు రాష్ట్రస్థాయి కమిటీ సమావేశంలో పాల్గొని, సంబంధిత శాఖల ఉన్నతాధి, కారులతో కలిసి కీలక అంశాలపై చర్చించారు.ప్రధానంగా బోనాఫైడ్ ప్లాట్ కొనుగోలుదారులకు న్యాయం,బాండ్‌దారుల ధ్రువీకరణ,అగ్రిగోల్డ్ ప్లాంటేషన్ల ఆడిట్ అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు.మొత్తం 42,531 మంది బోనాఫైడ్ ప్లాట్ కొనుగోలుదారుల్లో 35,544 మందికి రిజిస్ట్రేషన్ పూర్తైనట్లు గుర్తించి,వారికి ప్రాధాన్యతనిస్తూ న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.రిజిస్ట్రేషన్ పూర్తికాని 6,987 మంది వివరాలను పరిశీలించి తదుపరి దశలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోనున్నారు. అలాగే బాండ్‌దారుల వివరాల ధ్రువీకరణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 20 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు,అగ్రిగోల్డ్ ప్లాంటేషన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి విలువను పారదర్శకంగా అంచనా వేయాలని నిర్ణయించారు. అగ్రిగోల్డ్ బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. అన్ని శాఖల సమన్వయంతో ప్రక్రియను వేగవంతం చేసి,బాధితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అని ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.

## వేణుంభాకం అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార మాసోత్సవం



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం స్త్రీ శిశు సంక్షేమ శాఖ ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ మహ్ అనే కార్యక్రమం ద్వారా పోషకాహార మాస్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.ఈ క్రమంలో భాగంగా సూపర్వైజర్ అంకమ్మ దొరవారిసత్రం మండల పరిధిలోని వేణుంభాకం అంగన్వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార మాసోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యమే-మహాభాగ్యం అన్న సామెత నిజం కావాలంటే ప్రతి ఒక్కరికి దినసరి ఆహారంలో అందాల్సిన సమ పోషక పదార్థాలు ఆహారంగా తీసుకోవాలని సూచించారు.ప్రధానంగా గర్భవతి, బాలింతలు ఆరోగ్యకరంగా ఉండాలంటే సమతుల్య ఆహారం తీసుకోవాలని తెలిపారు.అదేవిధంగా ఆరేళ్లలో పిల్లలు కూడా ఆరోగ్యంతో పాటు,శారీరక ఎదుగుదల,మానసిక పరిపాక్వత రావాలంటే పోషకాహారాన్ని వారికి అందించా లని పేర్కొన్నారు. రక్తహీనత నివారణకు ఐరన్ కలిగిన ఆకుకూరలను అధికంగా తీసుకోవాలని చెప్పారు.బాలల వికాసం, సమాజ భాగస్వామ్యం,అనే అంశాలపై చర్చించారు. చిన్నారులు చిన్ననాటి నుండి ఆట వస్తువులతో అవగాహనతో కూడిన విద్య అలవర్చుడానికి అవగాహన కల్పించాలి తప్ప,సెల్ ఫోన్ లు,టీవీలకు చిన్ననాటి నుండి బానిసత్వం కాకుండా తల్లి దండ్రులు జాగ్రత్త పడాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అంకమ్మ, కార్యకర్తలు,గర్భవతులు, కిశోర బాలికలు, చిన్నారుల తల్లులు, ప్రధాన ఉపాధ్యాయులు తెలుగుదేశం పార్టీ మండల నాయకులు ఎస్‌కే షబ్బీర్, పాల్గొన్నారు.

## లింగారెడ్డి భానుప్రకాష్ రెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీ లింగారెడ్డి భానుప్రకాష్ రెడ్డి తండ్రి,రిటైర్డ్ విద్యుత్ శాఖలో అసిస్టెంట్ ఇంజనీర్ లింగారెడ్డి జయరామ రెడ్డిమృతి చెందారు.ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య లింగారెడ్డి భానుప్రకాష్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జయరామ రెడ్డి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తంబిరెడ్డి సుబ్రహ్మణ్యరెడ్డి జిల్లా నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి,ఓజిలి మండల అధ్యక్షులు పదార్థి హరినాథ్ రెడ్డి నాయుడుపేట రూరల్ అధ్యక్షులు శ్రీ కిషోర్ యాదవ్,మండల రైతు అధ్యక్షులు కట్ట భవాని శంకర్ రెడ్డి రాష్ట్ర కళాకారుల సెక్రటరీ కటకం జయరామయ్య తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొని భానుప్రకాష్ రెడ్డి కుటుంబ సభ్యులను పరా మర్శించారు. లింగారెడ్డి జయరామ రెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని అన్నారు.



## నత్తనడకన సూళ్లూరుపేట-కోటపోలూరు రోడ్డు పనులు

- కాంగ్రెస్ ఇంచార్జ్ డి.కిరణ్ కుమార్ ఆగ్రహం
- మెటల్ రోడ్డుతో వాహనదారుల నరకయాతన..
- గులకరాళ్లతో నిత్యం ప్రమాదాలు
- ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే ఊరుకునేది లేదు
- కిరణ్ కుమార్ హెచ్చరిక"



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట నుండి కోటపోలూరు వెళ్లే ప్రధాన రహదారి పనులు తీవ్ర జాప్యంతో నత్తనడకన సాగుతుండటంపై సూళ్లూరుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ డి.కిరణ్ కుమార్ తీవ్ర ఆందోళన, ఆగ్రహం వ్యక్తం చేశారు రోడ్డు పునరుద్ధరణ పనుల్లో భాగంగా రహదారిపై గులకరాళ్లు పోసి దాదాపు నెల రోజులు కావస్తున్నా తదుపరి పనులను చేపట్టకుండా అధికారులు కాంట్రాక్టర్లు అలానే వదిలేయడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు.ఈ గులకరాళ్ల రోడ్డుపై ప్రయాణించడం ప్రయాణికులకు నరకప్రాయంగా మారిందని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు వాహనాలు స్కిడ్ అయి కిందపడి తీవ్ర గాయాలపాలవుతున్నారని తెలిపారు. రోడ్డుపై చల్లిన పదునైన రాళ్ల కారణంగా వాహనాల టైర్లు దెబ్బతిని తరచూ పంక్చర్లు అవుతుండటంతో, మరమ్మతుల కోసం సామాన్య ప్రజలు అదనపు ఖర్చు భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్య వైఖరి స్వచ్ఛమైన ప్రజా ప్రయాణాన్ని ప్రమాదంలోకి నెడుతోందన్నారు.

ఇప్పట ికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న సూళ్లూరుపేట - కోటపోలూరు రోడ్డు నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. రహదారి పనుల్లో జాప్యం వల్ల ఎలాంటి అవాంఛనీయ ప్రమాదాలు జరిగినా దానికి సంబంధిత అధికారులే సంపూర్ణ బాధ్యత వహించాల్సి ఉంటుందని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని కిరణ్ కుమార్ హెచ్చరించారు.

## స్కాలర్‌షిప్‌లు ఎక్కడ? ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎక్కడ?

- విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు వద్దు
- వెంటనే బకాయిలు విడుదల చేయాలి
- జి.ఓ.ఎంఎస్.నెంబర్.77ను రద్దు చేయాలి ప్రాంత
- ఎస్‌ఎఫ్‌డి కో-కన్వీనర్ తడుకు చందు




**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేస్తున్న విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో నాయుడుపేట గాంధీ మందిరం వద్ద తీవ్ర నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఏబీవీపీ ప్రాంత ఎస్‌ఎఫ్‌డీ కో-కన్వీనర్ తడుకు చందు పాల్గొని ప్రభుత్వాన్ని విద్యార్థుల సమస్యలపై తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. "స్కాలర్‌షిప్‌లు కావాలి.. .ఫీజు రీయింబర్స్‌మెంట్ రావాలి"అంటూ విద్యార్థుల తరపున ఏబీవీపీ నినదించింది.అర్హులైన విద్యార్థులకు అందాల్సిన స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీయింబర్స్ మెంట్‌లో జాప్యం వల్ల విద్యార్థులు,వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవాలని కోరారు.పీజీ విద్యార్థుల పాలిట శాపంగా మారిన జి.ఓ .ఎంఎస్.నెంబర్.77ను తక్షణమే రద్దు చేసి, అర్హులైన పీజీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించాలని తడుకు చందు డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యను వ్యాపారంగా మార్చే విధానాలను అరికట్టాలని, యూనిఫాం, పుస్తకాలు, బ్రాండింగ్ తదితర పేర్లతో విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం మోపే విధానాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వాన్ని కోరారు .కేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్,నాన్-టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ నియమ నిబంధనలు పాటించని విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఇష్టారాజ్యంగా విద్యాసంస్థలు నిర్వహిస్తున్న యాజమా న్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.తిరుపతి జిల్లాలో ప్రభుత్వ గుర్తింపు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలు, కళాశా లలను గుర్తించి మూసివేయడంతో పాటు సంబంధిత యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ హాస్టళ్ల పరిస్థితులను మెరుగు పరచాలని, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు శాశ్వత హాస్టల్ భవనాలను నిర్మించాలని కోరారు.ఈ సందర్భంగా తడుకు చందు మాట్లాడుతూ, "విద్యార్థుల హక్కుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ఏబీవీపీ చూస్తూ ఊరుకోదు. స్కాలర్‌షిప్‌లు,ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి. జి.ఓ.ఎంఎస్.నెంబర్.77ను రద్దు చేసి విద్యార్థులకు న్యాయం చేయాలి.విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే మరింత పెద్దస్థాయిలో ఉద్యమాలు చేపడతాం"అని అన్నారు.ఈ కార్యక్రమంలో బాగ్ కన్వీనర్ ఆరిఫ్ నగర కార్యదర్శి నవీన్ కుమార్, నగర కమిటీ తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు అధికారుల పనితీరుపై టీడీపీ నాయకుల ఆగ్రహం

**- విధులకు హాజరు కావడం లేదని ఆరోపణలు..**
**- ప్రజలకు సేవలు అందించడంలో నిర్లక్ష్యమంటూ మండిపాటు**



**బెలుగుప్ప- సూర్య వాస్తవం :** మండలంలోని స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు పని చేస్తున్న అధికారుల పనితీరుపై టీడీపీ సీనియర్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బెలుగుప్ప మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు సిబ్బంది విధుల నిర్వహణపై వారు అసంతృప్తి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు పెద్దతిప్పయ్య మాట్లాడుతూ.. కొన్ని స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు పంచాయతీ కార్యదర్శులు సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని, కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండకుండా కాలయాపన చేస్తున్నారంటూ ఆరో పించారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రజలకు సేవలు అందించాల్సిన బాధ్యతను గుర్తించి పనిచేయాలని సూచించారు. మండలంలోని స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డుల ను మండల పరిషత్ అభివృద్ధి అధికారి లక్ష్మీనారాయణ క్షేత్రస్థాయిలో తరచూ తనిఖీ చేసి సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని కోరారు. స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు అధికారుల హాజరు, ప్రజలకు అందుతున్న సేవలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, సంబంధిత సేవల విషయంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని టీడీపీ నాయకులు కోరారు. పింఛన్ల అమలులో పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత సిబ్బంది పాత్ర కీలకమని ప్రభుత్వ మార్గదర్శకాల్లోనూ పేర్కొన్న నేపథ్యంలో, విధుల్లో నిర్లక్ష్యానికి తావు లేకుండా పర్యవేక్షణ ఉండాలని అన్నారు.విధులు సక్రమంగా నిర్వహిస్తున్న సిబ్బందిని ప్రోత్సహించడంతో పాటు, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వారిపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



## ముగిసిన 3రోజుల వామపక్షాల నిరాహార దీక్షలు

**పామిడి - సూర్య వాస్తవం :** రైతాంగాన్ని, ప్రజలను కూటమి ప్రభుత్వాశీ ఆదుకోవాలని,జిల్లాను జాతీయ కరువువిపత్తు జిల్లాగా ప్రకటించాలని 21 22 23 తేదీల యందు నిర్వహించిన వామపక్ష పార్టీల విదేయ నిరాహార దీక్షలు మూడో రోజున బుధవారం ముగిసాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లా రైతాంగాన్ని, ప్రజలను కూటమి ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానికి వుందని,రాష్ట్రవ్యాప్తంగా తగిన వర్షాలు లేక పోవడంతో రైతులు, ప్రజలు, వ్యాపారస్తులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ముఖ్యంగా రాయలసీమ జిల్లాల్లో అత్యంత కరువు అనంతపురంజిల్లాలో తీవ్రస్థాయిలో ఉందన్నారు,పంటలు సాగు చేసిన రైతులు, వర్షం సరిగా లేక లక్షల్లో పెట్టుబడులు నష్టపోయారని, అందులో ఎంపిఆర్ డ్యాం నీరు అందక దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటు న్నారని ఆవేదన వ్యక్తపరుస్తున్నారు.కరువు ప్రభావంతో వ్యవసాయ రంగంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చిన్నా భిన్నమైందని, పంట పొలాలు ఎండిపోవడమే గాక రైతులకు సాగునీరు, తాగునీరు, పశువులకు అవసరమైన నీరు, పశుగ్రాసం వంటి సమస్యలు తీవ్ర దుర్భర స్థితికి చేరుకున్నట్లు వారు ఆవేదన వ్యక్తపరిచారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించి, అనంతపురం జిల్లాను జాతీయ కరువు విపత్తు జిల్లాగా ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.కరువు కారణంగా నష్టపోయిన రైతులకు తక్షణమే ఆర్థిక సహాయం అందించడంతో పాటు, పంట నష్టపరిహారం, రెండు లక్షల రూపాయలు రుణ ఉపశమనం, సాగునీటి సౌకర్యాలకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వామపక్ష పార్టీల ముఖ్య నాయకులు కే.రహీం, అనిమిరెడ్డి, గజ్జల దస్తగిరి, మల్లేష్, కోదండ రామిరెడ్డి, నాగరాజు ప్రభుత్వపై విమర్శనాస్త్రాలు గుప్పించారు.ఈ కార్యక్రమంలోమల్లేష్ గజ్జల దస్తగిరి ఇమాములు సారంబి,కోదండరామిరెడ్డి లక్ష్మీ నారాయణ, ఓబులయ్య రంగనాయకులు తిరుపాలు సాలమ్మ శంకరమ్మ సరో జమ్మ లక్ష్మీదేవి అత్తమ్మ వామపక్ష నాయకులు రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# 'ప్యారడైజ్'కు మెగా బూస్ట్..

## నాని, శ్రీకాంత్ ఓదెలపై చిరంజీవి ప్రశంసల వర్షం

నేచురల్ స్టార్ నాని, శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న 'ది ప్యారడైజ్' చిత్రం విడుదలకు సిద్ధమైంది. రేపు (సెప్టెంబరు 24) ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో, మెగాస్టార్ చిరంజీవి చిత్ర బృందానికి తన శుభాకాంక్షలు తెలుపుతూ స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని పంచుకున్నారు. నాని నటన పట్ల ఉన్న నిబద్ధతను, కొత్తదనాన్ని కోరుకునే అతని తపనను చిరంజీవి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా చిరంజీవి సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ, "నా ప్రియమైన నాని, కొత్త విషయాలు తెలుసుకోవాలనే నీలోని ఉత్సాహం, ఆకలి, నిజాయితీ ఎప్పుడూ అద్భుతంగా ఉంటాయి. 'దసరా' సినిమాకు నువ్వు, శ్రీకాంత్ పడిన తపన, చూపిన అభిరుచి చూశాక, మీ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న 'ది ప్యారడైజ్' అనే సరికొత్త ప్రపంచాన్ని చూడటానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను.

ఈ ప్రత్యేకమైన సినిమాను పెద్ద తెరపై అనుభూతి చెందాలనుకుంటున్నాను" అని పేర్కొన్నారు. చిత్ర బృందం మొత్తానికి తన ఆశీస్సులు తెలియజేస్తూ, ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కొత్త మైలురాళ్లను సృష్టించి, అందరికీ గుర్తుండిపోయే విజయాన్ని అందించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చిరంజీవి వివరించారు. 'ది ప్యారడైజ్' చిత్రంలో నాని సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటించింది. డైలాగ్ కింగ్ మోహన్ బాబు 'శికంజా మాలిక్' అనే శక్తివంతమైన విలన్ పాత్రలో కనిపించనుండగా, విక్రమ్ మాలిక్ గా రాఘవ్ జుయల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన సంగీతం ఇప్పటికే చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ముఖ్యంగా 'ఆయా షేర్', 'ఏష నాగుల' పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. దసరా వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత అదే కాంబినేషన్‌లో



వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొనగా, ఇప్పుడు చిరంజీవి ప్రశంసలతో ఆ అంచనాలు మరింత పెరిగాయి.



## చార్మింగ్ స్టార్ శర్వా 'జార్జ్ క్రిష్'లో హీరోయిన్ గా మానస వారణాసి

'నారీ నారీ నడుమ మురారీ', 'బైకర్' విజయాలతో జోష్‌లో ఉన్న చార్మింగ్ స్టార్ శర్వానంద్ దర్శకుడు శ్రీను వైట్లతో తొలిసారిగా చేతులు కలిపారు. వీరి కాంబినేషన్ లో 'జార్జ్ క్రిష్' పండుగ సీజన్‌లో కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌ట్రైనర్‌గా అలరించబోతోంది. ఏటీవీ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మిస్తుండగా, అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రం 2027 జనవరి 14న సంక్రాంతికి ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. గతంలో విడుదల చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో కలర్‌ఫుల్ ఫెస్టివ్ లుక్ ఆకట్టుకుంది. అందులో శర్వానంద్ హీరోయిన్‌ను ఎత్తుకున్న సిల్హౌట్ ఆసక్తిని పెంచింది. తాజాగా ఈ సినిమాలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'కపుల్ ఫ్రెండ్లీ' తో సూపర్ హిట్ అందుకున్న మానస వారణాసి.. 'జార్జ్ క్రిష్'లో శర్వానంద్‌కు జోడీగా కనిపించనున్నారు. టైటిల్ పోస్టర్‌ను బట్టి సినిమాలో లవ్ స్టోరీకి కీలక ప్రాధాన్యత ఉండబోతోంది. మానస పాత్ర కథలో కీలకంగా ఉండనుంది. ఫస్ట్ బూస్టర్‌ను రేపు విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రానికి అటాప్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది. కేవీ గుహన్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తుండగా, అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా, అమర్ రెడ్డి కుడుముల ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. నందు సవిరిగాన, గోపీ మోహన్ రైటింగ్ డిపార్ట్‌మెంట్‌లో భాగం కాగా, కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది.

## పుష్ప సినిమాలో ఆ పాత్ర నేను చేయాల్సింది.. కానీ!: శివాజీ

టాలీవుడ్ నటుడు శివాజీ 'తెల్ల కాగితం' సినిమా ప్రచార కార్యక్రమంలో మాట్లాడుతూ... ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ – సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన దిగ్గజ చిత్రం 'పుష్ప'కు సంబంధించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. 'పుష్ప' చిత్రంలో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న ప్రతి నాయక ఛాయలున్న 'మంగళం శ్రీను' పాత్ర మొదట తనకే రావలసి ఉందని శివాజీ తెలిపారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ... "మంగళం శ్రీను పాత్రకు మొదట సుకుమార్ నన్నే అనుకున్నారు. కానీ ఒక పాత్ర ఎవరికి రాసి ఉంటే చివరికి వాళ్లకే దక్కుతుంది. నాకు రాసి లేని పాత్రను నేనెలా చేయగలను? ఆ పాత్ర సునీల్‌కే రాసి పెట్టి ఉంది, అందుకే ఆయన వద్దకు వెళ్లింది. సునీల్ ఆ పాత్రలో అద్భుతంగా జీవించారు, ఎవరు ఏ పాత్ర చేసినా



చివరికి అది వాళ్లకే సరిపోతుంది" అని వ్యాఖ్యానించారు. 'తెల్ల కాగితం' విశేషాలను ఆయన పంచుకుంటూ... సినిమాల్లోకి రీ-ఎంట్రీ ఇచ్చే సమయంలో తాను విన్న రెండో కథ ఇదేనని, కథ బాగా నచ్చడంతో ఈ చిత్రాన్ని తానే నిర్మించాలని అనుకున్నట్లు తెలిపారు.

అయితే ఈ కథ పలువురు నిర్మాతల చేతులు మారి, చివరకు శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ అధినేత దిల్ రాజు, కృష్ణ కొమ్మలపాటి సంయుక్త నిర్మాణంలో తెరకెక్కి తన వద్దకే రావడంతో ఎంతో సంతోషంగా ఉందన్నారు. రమేశ్ బండ్రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాతో పాటు, గ్రాఫిక్స్ కు ప్రాధాన్యత ఉన్న 'కూర్మావతారం' అనే చిత్రంలోనూ తాను నటిస్తున్నట్లు శివాజీ వెల్లడించారు.



## వాళ్లిద్దరూ ప్రపంచ కప్ గెలవాలని దేశం మొత్తం కోరుకుంటోంది: రింకూ సింగ్

విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత్ తరఫున ఆడాలని దేశం మొత్తం కోరుకుంటోందని టీమిండియా బ్యాటర్ రింకూ సింగ్ అన్నాడు. ఇద్దరూ దిగ్గజ ఆటగాళ్లని పేర్కొన్న అతడు.. 2027 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలిస్తే అది దేశానికే కాకుండా కోహ్లీ, రోహిత్‌కు కూడా ఎంతో ప్రత్యేకమైన సందర్భమవుతుందని చెప్పాడు. "విరాట్ భయ్యా, రోహిత్ భయ్యా ఇద్దరూ లెజెండ్స్. వాళ్లు ప్రపంచకప్‌లో ఆడాలని నా ఒక్కడి కోరిక కాదు.. దేశం మొత్తం కోరుకుంటోంది. వాళ్లు జట్టులో ఉండి భారత్‌ను ప్రపంచకప్ విజేతగా నిలిపితే ఎంతో గొప్పగా ఉంటుంది. అది వాళ్లకు చివరి ప్రపంచకప్ కావచ్చేమో. 2011 తర్వాత భారత్ వన్డే ప్రపంచకప్ గెలవలేదు. అందుకే వాళ్లిద్దరూ జట్టుతో ఉండి ట్రోఫీ గెలిస్తే ఎంతో ప్రత్యేకం" అని జియోస్టార్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రింకూ చెప్పాడు. ఐపీఎల్ 2023లో గుజరాత్ టైటాన్స్‌పై వరుసగా ఐదు సిక్సర్లు బాదడంతో రింకూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. అయితే తనను కేవలం ఆ ఐదు సిక్సర్లతోనే గుర్తించకూడదని అతడు అంటున్నాడు. భారత్ తరఫున ప్రపంచకప్ గెలవడంలో భాగస్వామి కావడమే ప్రస్తుతం తన ప్రధాన లక్ష్యమని చెప్పాడు. బ్యాటింగ్‌తో జట్టుకు ఉపయోగపడుతూ మరిన్ని ప్రపంచకప్ విజయాల్లో భాగం కావాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. ఇక తాను కేవలం



టీ20 ఆటగాడిననే అభిప్రాయాన్ని కూడా రింకూ ఖండించాడు. దేశవాళీ క్రికెట్‌లో వన్డేలు, నాలుగు రోజుల మ్యాచుల్లోనూ ఆడుతున్నానని చెప్పాడు. భారత్ తరఫున టెస్టుల్లో అరంగేట్రం చేయాలన్నది తన కల అని వెల్లడించాడు. ప్రస్తుతం భారత్ తరఫున ఒక్క ఫార్మాట్‌లోనే ఆడుతున్నా.. మూడు ఫార్మాట్లలోనూ రాణించగలనని విశ్వాసం వ్యక్తం చేశాడు. కెప్టెన్సీపై కూడా రింకూ స్పందించాడు. యూపీ లీగ్‌లో తన జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి టైటిల్ గెలిచానని గుర్తుచేశాడు. గత సీజన్‌లో ఐపీఎల్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్నానని చెప్పాడు. అజింక్య రహానే, సూర్యకుమార్ యాదవ్ వంటి ఆటగాళ్ల నుంచి నాయకత్వ లక్షణాలు నేర్చుకుంటున్నానని తెలిపాడు. కెప్టెన్సీలో ఇంకా ఎదగాల్సి ఉందని పేర్కొన్నాడు.



## ఐపీఎల్ 2027 వేలానికి వేదిక ఖరారు.. ఈసారి ఇండియాలోనే!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2027 సీజన్ వేలంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కీలక ప్రకటన చేసింది. ఈ ఏడాది డిసెంబర్‌లో గోవా వేదికగా ఆటగాళ్ల వేలం నిర్వహించనున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా బుధవారం స్పష్టం చేశారు. అయితే, వేలానికి సంబంధించిన కచ్చితమైన తేదీలను ఇంకా వెల్లడించాల్సి ఉంది. గత మూడు పర్యాయాలుగా ఐపీఎల్ వేలం విదేశాల్లోనే జరిగింది. అబుదాబి, దుబాయ్, సౌదీ అరేబియా వంటి నగరాలు ఈ వేలానికి వేదికలుగా




నిలిచాయి. అయితే, ఈసారి తిరిగి భారత్‌లోనే వేలం నిర్వహించాలని నిర్ణయించినట్లు సైకియా తెలిపారు. "గత మూడుసార్లు వేలాన్ని అబుదాబి, దుబాయ్, సౌదీ అరేబియాలో నిర్వహించాం. ఈసారి డిసెంబర్‌లో గోవాలో నిర్వహించాలని నిర్ణయించాం" అని ఆయన మీడియాకు వివరించారు. ఇదే సందర్భంలో బీసీసీఐ మరో కీలక నిర్ణయాన్ని వెల్లడించింది. ఇండియా 'ఏ', ఆస్ట్రేలియా 'ఏ' మహిళా జట్ల మధ్య జరగాల్సిన మల్టీడే మ్యాచ్ వేదికను మార్పు చేశారు. హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో భారీ వర్షాలు కురుస్తున్న కారణంగా, ఈ మ్యాచ్‌ను పంజాబ్‌లోని మొహాలీకి తరలించారు. ఈ మ్యాచ్ సెప్టెంబర్ 29 నుంచి అక్టోబర్ 2 వరకు జరగనుంది.

## ఆసియా క్రీడల్లో మీరాబాయి చానుకు చారిత్రక రజతం..

### –భారత్ ఖాతాలో మరో 3 పతకాలు

జపాన్‌లోని ఐచి-నగోయాలో జరుగుతున్న ఆసియా క్రీడలు 2026లో నాలుగో రోజు భారత్‌కు చిరస్మరణీయంగా నిలిచింది. వెయిట్‌లిఫ్టింగ్ సూపర్ స్టార్ మీరాబాయి చాను మహిళల 49 కేజీల విభాగంలో చారిత్రక రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఆసియా క్రీడల్లో ఆమెకు ఇదే తొలి పతకం కావడం విశేషం. ఈ విజయంతో ఆమె కెరీర్‌లో మరో మైలురాయిని



అందుకుంది. ఇదే రోజు మరో చారిత్రక విజయం కూడా నమోదైంది. సాఫ్ట్ టెన్నిస్‌లో జై మీనా కాంస్య పతకం సాధించి, ఈ క్రీడలో భారత్‌కు తొలి పతకాన్ని అందించాడు. సెమీఫైనల్ మ్యాచ్‌లో గాయపడటంతో అతను పోరాటాన్ని కొనసాగించలేకపోయినా, కాంస్యంతో దేశానికి గర్వకారణంగా నిలిచాడు. షూటింగ్ రేంజ్‌లోనూ భారత్ పతకాల వేట కొనసాగించింది. పురుషుల స్కీట్ టీమ్ (అనంత్‌జీత్ సింగ్ నరుకా, మైరాజ్ ఖాన్, భవ్‌తేఘ్ సింగ్ గిల్) కాంస్య పతకాన్ని గెలుచుకుంది. అంతకుముందు మహిళల స్కీట్ జట్టు కూడా ఇదే విభాగంలో కాంస్యం సాధించింది. అయితే, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్‌లో డబుల్ ఒలింపిక్ పతక విజేత మను భాకర్‌కు నిరాశ ఎదురైంది. ఆమె పతకం లేకుండానే వెనుదిరిగింది. ప్రస్తుతం భారత్ ఒక స్వర్ణం, ఐదు రజతాలు, ఐదు కాంస్యాలతో కలిపి మొత్తం 11 పతకాలతో పట్టికలో 11వ స్థానంలో కొనసాగుతోంది.

## ఘనంగా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి మాస కల్యాణ మహోత్సవం





**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాములవారి మఠంలో ప్రతినెల శుద్ధ ద్వాదశి సందర్భంగా నిర్వహించే మాస కల్యాణ మహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భాద్రపద శుద్ధ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామివారి మాస కల్యాణ మహోత్సవాన్ని మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీరధర్మజ వెంకటాద్రి స్వాములవారి ఆశీస్సులతో నిర్వహించారు. అర్చకులు వేద మంత్రోచ్ఛారణల నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో మఠాధిపతుల సోదరులు శ్రీ దత్తాత్రేయ స్వామివారు, భక్తులు, పురప్రజలు, మీడియా ప్రతినిధులు, నిర్వాహకులు, అర్చకులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని భక్తులు తిలకించి భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అనంతరం కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

## బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలి



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని డిసిపియు కౌన్సిలర్ నజీర, కేసు వర్కర్ పుష్పలత లు పేర్కొన్నారు. బాలల హక్కులు రక్షణ చట్టాలు సహాయ సేవలపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని వారుతెలిపారు. మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో లక్కిరెడ్డిపల్లి లో బుధవారం మండల సమైక్య సభ్యులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ బాలలపై హింస, అక్రమ రవాణాను అరికట్టెందుకు అందరూ బాధ్యత వివరించాలని సూచించారు. ఆపదలో ఉన్న పిల్లల కోసం1098, 112 కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

## స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత

### - ఎంపీడీవో రామచంద్రారెడ్డి



**బ్రహ్మంగారిమఠం- సూర్య వాస్తవం:** స్వచ్ఛత అనేది కేవలం ప్రభుత్వ శాఖలు, సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించి పరిసరాల పరిశుభ్రతకు చొరవ చూపాలని ఎంపీడీవో రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం బ్రహ్మంగారిమఠంలో నిర్వహించిన 'స్వచ్ఛతా హీ సేవా', 'స్వచ్ఛ పథం' కార్యక్రమాల్లో ఎంపీడీవో రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పారిశు ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం శానిటేషన్, నీటి వనరుల పరిశుభ్రత, తడి చెత్త--పొడి చెత్త వేరు చేయడం, వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 'పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు', 'చెట్లను పెంచుదాం--కాలుష్యాన్ని నివారిద్దాం' వంటి నినాదాలతో పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లోనూ స్వచ్ఛతా హీ సేవా, స్వచ్ఛ పథం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల పరిషత్ పరిపాలన అధికారి నరసయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, పంచాయతీ అభివృద్ధి అధికారులు, మండల పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సరుకులు 100శాతం తూకాలు వేసి డీలర్లకు అందించాలి



**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** ప్రజలకు అందిస్తున్న నిత్యవసర సరుకులు 100% తూకాలు వేసి డీలర్లకు అందించాలని జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ అర్జున్ రావు పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లి లోని నిత్యవసర సరుకుల గోదామును ఆయన పరిశీలించారు. ముందుగా రికార్డులు బియ్యము గోధుమపిండి చక్కెర నిల్వలను ఆయన పరిశీలించారు. క్యూఆర్ కోడ్ ఉన్నటువంటి బియ్యపు బస్తాలను డీలర్లు తప్పనిసరిగా స్కాన్ చేసుకోవాలని ఆయన తెలిపారు. 26 నుంచి వృద్ధులకు ఇంటి వద్దకే నిత్యవసర సరుకులు అందేటట్లు చూడాలన్నారు. డీలర్లు సకాలంలోనే డీడీలు చెల్లించి సరుకులు తీసుకెళ్లి ప్రజలకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గోదాము ఇంచార్జ్ మల్లికార్జున బాబు సిబ్బంది పాల్గొన్నారు.

# యువకుడిపై దాడి

### - నలుగురు నిందితుల అరెస్టు



**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం:** రాయచోటి పట్టణానికి చెందిన జనసేన యువజన విభాగం అధ్యక్షుడు ముదిరిన విజయ్ పై రాయచోటికి చెందిన నలుగురు వ్యక్తులు ఇనుప రాడ్డు, రాళ్లతో దాడి చేసి గాయపరిచిన సంఘటనకు సంబంధించి రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయబడింది. పోలీసులకు అందిన ఫిర్యాదు మేరకు, సంఘటన జరిగిన సమయంలో ముదిరిన విజయ్‌పై నిందితులు కలిసి దాడి చేయడంతో ఆయనకు గాయాలు అయినట్లు ఫిర్యాదులో పేర్కొనబడింది. ఈ ఘటనపై రాయచోటి అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా సంఘటనకు సంబంధించి అందుబాటులో ఉన్న సమాచారం, సాక్షుల వాంగ్మూలాలు, సీసీటీవీ ఫుటేజీ మరియు ఇతర ఆధారాలను పరిశీలించి నిందితులను గుర్తించారు. ఈ కేసులో నిందితులుగా గుర్తించబడిన: మోహిత్ రెడ్డి, మస్తాన్, సాయి తేజ, ఓమర్, మంజునాథ, అనే నలుగురిని రాయచోటి అర్బన్ పోలీసులు అరెస్టు చేశారు.

అరెస్టు చేసిన నిందితులను చట్టపరమైన ప్రక్రియను అనుసరించి గౌరవ న్యాయస్థానం ఎదుట హాజరు పరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు తదుపరి చర్యలు చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా రాయచోటి అర్బన్ పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా దాడులు, ఘర్షణలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోబడతాయని తెలిపారు. ప్రజలు ఎటువంటి వివాదాలకు పాల్పడకుండా, సమస్యలు తలెత్తినప్పుడు పోలీసులను సంప్రదించాలని సూచించారు.

## జాతీయ స్థాయి రోల్ ప్లే, జానపద నృత్య పోటీలకు విద్యార్థులు సిద్ధం కావాలి

### - జాతీయ పోటీల్లో సత్తా చాటేందుకు అవకాశం: డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** విద్యార్థుల్లో సృజనాత్మకత, వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలు, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించేందుకు 2026--27 విద్యా సంవత్సరానికి జాతీయ స్థాయి రోల్ ప్లే, జానపద నృత్య పోటీలు నిర్వహిస్తున్నట్లు డైట్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. బుధవారం డైట్‌లో పోటీలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ఖ+దీఎ పాఠశాలల్లో 9వ తరగతి విద్యార్థులు రోల్ ప్లే, 8, 9వ తరగతుల విద్యార్థులు జానపద నృత్య పోటీల్లో పాల్గొనవచ్చున్నారు. జానపద నృత్య బృందంలో 4 నుంచి 6 మంది విద్యార్థులు ఉండాలని, ప్రదర్శన 5--6 నిమిషాల వ్యవధిలో ఉండాలని తెలిపారు. రోల్ ప్లే, జానపద నృత్యాల్లో ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, బాధ్యతాయుత పౌరసత్వం, లింగ సమానత్వం, మాదక ద్రవ్యాల నివారణ, మానసిక ఆరోగ్యం, భద్రత తదితర అంశాలను ప్రతిబింబించేలా ప్రదర్శనలు ఉండాలని సూచించారు. అక్టోబర్ 10లోపు పాఠశాల, మండల స్థాయి పోటీలు, అక్టోబర్ 25లోపు జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు, పోటీలకు సంబంధించి కడప జిల్లా కోఆర్డినేటర్ డా. వై. గిరిబాబు యాదవ్, అన్నమయ్య జిల్లా కోఆర్డినేటర్ కె. వెంకటసుబ్బారెడ్డి, డైట్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.




## ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్‌లో వెయిటేజ్ మార్క్స్ ఇవ్వాలి

### -ఎస్ టి యు అధ్యక్షుడు అంకం శివారెడ్డి

**రాయచోటి-సూర్య వాస్తవం:** ఇన్ సర్వీస్ టీచర్లకు రాయవలసిన పరీక్షలకు వారి సర్వీస్‌కు వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని అన్నమయ్య జిల్లా ఎస్‌టియు అధ్యక్షుడు అంకం శివారెడ్డి అన్నారు. బుధవారం చిన్నమండెం మండలంలోని పలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిన్న మండెం మండలం ఎస్‌టి యు శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలోముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ రిజర్వేషన్ ప్రాతిపదికగా టెట్ లో ఏ విధమైన రూల్స్ పాటించినప్పటికీ ఇన్ సర్వీస్ డీఎస్సీ ద్వారా ఎంపికైనప్పుడు రిజర్వేషన్ ప్రాతిపదికగా ఎంపిక కావడం జరిగిందని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న క్వాలిఫైయింగ్ మార్క్స్ రిజర్వేషన్ ప్రాతిపదిక కాకుండా ఇన్సర్వి ఉపాధ్యాయులందరికీ క్వాలిఫైయింగ్ మార్క్స్ 60మార్కులుగా నిర్ధారించాలని ఆ విధంగా ప్రభుత్వం తగు శ్రద్ధ వహించి చొరవ చూపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలా వీలు కానీపక్షంలోఉపాధ్యాయులు వారు పనిచేసిన సర్వీస్ కాలానికి వెయిటేజ్ మార్కులు ఇచ్చేలా చూడాలని, దీనివలన నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలో వచ్చే విద్యారు ్థలకు టెట్ పరీక్షకు సంబంధించి ఏ విధమైన ఆటంకం ఉండదని దీనిని అందరూ సమర్థించే అవకాశం ఉంటుందని ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్‌టియు నాయకులు మండిపల్లి చంద్రశేఖర్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి జిల్లా నాయకులు పి రామానుజులు, వై వెంకట్రాంరెడ్డి సీనియర్ నాయకులు, శేఖర్ రెడ్డి, మండల అధ్యక్షులు వెంకట రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## విద్యా ప్రమాణాలు మెరుగుపరచుకొని మంచి ఫలితాలు సాధించండి

**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** విద్యా ప్రమాణాలు మెరుగుపరచుకొని 10 ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు సాధించాలని ఎంపీ డీవో రెడ్డయ్య



ఎంఈఓ వెంకటసుబ్బయ్యలు పేర్కొన్నారు. బుధవారం ఏపీ మోడల్ స్కూల్లో పదో తరగతి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ... యూనిట్ పరీక్షలు ఫలితాలు ఆధారంగా రాబోయే పబ్లిక్ పరీక్షల్లో కూడా మార్కులు సాధించాలని ఆయన సూచించారు. అంతేకాకుండా ఉదయము సాయంత్రము ప్రత్యేక తరగతులు ఉపయోగించుకోవాలని సూచించారు.

యూనిట్ పరీక్షల్లో పెరిగిన మార్కులు నెలవారీ ఫలితాలలో పెరిగి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనంను వారు పరిశీలించి రుచికరమైన భోజనాన్ని పిల్లలకు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : 41/1320, Sankarapuram, Kadapa, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, CELL : : 9885404140